

హౌసింగ్ ఇన్‌చార్జి పీడీగా చిరంజీవి

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా గృహ నిర్మాణ సంస్థ ఇన్‌చార్జి పీడీగా టి. చిరంజీవి నియమితులయ్యారు. ప్రస్తుతం అమరావతి ఎక్స్‌ప్రెస్ వే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఈయనకు పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ పి. రంజిత్‌బాషా ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఇన్‌చార్జి పీడీగా పనిచేస్తున్న విశ్వనాథ్‌ను నంద్యాల ఆర్డీవోగా బదిలీ చేశారు.

యురేనియంపై వదంతులు నమ్మొద్దు

కలెక్టర్ పి. రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): యురేనియం లభ్యత, పరిశోధన కోసం కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్టు చుట్టుపక్కల గ్రామాల పరిధిలో బోర్ల తవ్వకాలు జరగడం లేదని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. ఈ విషయంలో వదంతులను, అసత్య ప్రచారాలను నమ్మవద్దని తెలిపారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలు చెందనవసరం లేదని అన్నారు. గత కొన్ని రోజులుగా కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్టు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు యురేనియం లభ్యత కోసం బోర్ల తవ్వకాలకు వ్యతిరేకంగా చేపడుతున్న నిరసనలు, ఆందోళనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

అసత్య ప్రచారం చేస్తే చర్యలు: ఎస్పీ

కర్నూలు క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దేవనకొండ మండలం, కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్టులో యురేనియం తవ్వకాలపై అసత్య ప్రచారం చేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్పీ జి. బిందుమాధవ్ అన్నారు. ఎవరైనా సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు వదంతులు, అసత్య ప్రచారాలు నమ్మవద్దన్నారు.

డీపీఆర్‌సీలో ముగిసిన శిక్షణ

కర్నూలు న్యూసిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ఎంపీడీఓలు, ఈఓఆర్‌డీలు, పంచాయతీ సెక్రటరీ, డిజిటల్ అసిస్టెంట్లకు డీపీఆర్‌సీలో నిర్వహించిన రెండు రోజుల శిక్షణ బుధవారం ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రీయ స్వరాజ్ అభియాన్ నిధులతో ఏపీ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణా సంస్థ ద్వారా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ప్రజాప్రణాళిక ప్రచారం(2024-25) ద్వారా పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (2025-26) తయారీ ప్రక్రియపై జిల్లా స్థాయి టీఓటీలు అవగాహన కల్పించారు. ప్రతి మండలం నుంచి ఎంపీడీఓ, ఈఓఆర్‌డీలతోపాటు పంచాయతీ సెక్రటరీ, డిజిటల్ అసిస్టెంట్ హాజరయ్యారు. 7, 8 తేదీలలో రెండో బృందానికి శిక్షణ ఉంటుందని డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్ జి. నాసరరెడ్డి తెలిపారు. శిక్షణ తీసుకున్న వారందరూ ఈ నెల 12, 16 తేదీలలో సంబంధిత మండలాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు, మండల స్థాయి లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులకు శిక్షణ ఇవ్వాలన్నారు.





- సెమీ హైస్పీడ్ కారిడార్‌కు ప్రతిపాదన
- రైల్వే శాఖ గ్రీన్ సిగ్నల్
- రెట్టింపు వేగంలో సాగిపోనున్న రైళ్లు
- కర్నూలు నుంచి విశాఖకు నాలుగు గంటల ప్రయాణం

కర్నూలు - విశాఖ మధ్య రైలు మార్గం



రైలు మార్గం ఇలా..

కర్నూలు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి):

కర్నూలు-విశాఖపట్నం మధ్య సెమీ హైస్పీడ్ రైల్వే కారిడార్ అలైన్‌మెంట్ ప్రతిపాదనకు కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ రైలు మార్గం నిర్మాణం జరిగితే కర్నూలు నుంచి విశాఖకు నాలుగు గంటల్లో ప్రయాణం చేయవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రధాన నగరాలను కలుపుతూ సెమీ హైస్పీడ్ రైల్వే కారిడార్‌ను ఆ శాఖ అధికారులు ఖరారు చేశారు. ప్రధాన నగరాల మధ్య రైలు ప్రయాణం సమయాన్ని గణనీయంగా తగ్గించాలనే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఈ కారిడార్ పూర్తయితే కర్నూలు ప్రాంతం పారిశ్రామిక, వాణిజ్య పరంగా అభివృద్ధి చెందనుంది. రాజధాని అమరావతికి రెండు మూడు గంటల్లో చేరుకునే అవకాశం ఉంది. మంత్రాలయం-కర్నూలు వయా ఎమ్మిగనూరు రైలు మార్గాన్ని కూడా నిర్మిస్తే కర్నూలు సిటీ రైల్వేస్టేషన్ రైల్వే జంక్షన్‌గా మారుతుంది. ఆ దిశగా జిల్లా ప్రజాప్రతినిధులు కృషి చేయాల్సిన అవసరం ఉంది.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోని ప్రధాన నగరాల మధ్య ప్రయాణ సమయం తగ్గించాలన్నది ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. తెలుగు రాష్ట్రాల్లో తొలి సెమీ హైస్పీడ్ కారిడారి ఇది. శంషాబాద్ - విశాఖపట్నం వయా సూర్యాపేట, విజయవాడ మీదుగా రైల్వేలైన్‌ను ప్రతిపాదించారు. ప్రతిష్టాత్మకమైన ఈ ప్రాజెక్టులో భాగంగా విశాఖపట్నం నుంచి కర్నూలు వయా విజయవాడ, సూర్యపేట, నల్గొండ, కల్వకుర్తి, నాగర్ కర్నూలు మీదుగా కర్నూలుకు మరో కారిడార్ ప్రతిపాదించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రాథమిక ఇంజనీరింగ్, ట్రాఫిక్ (పీఈటీ) సర్వే పూర్తయిందని, ఈ నెలాఖరులోగా రైల్వే బోర్డుకు నివేదికలు అందజేస్తారని అధికారులు పేర్కొంటున్నారు.



కర్నూలు రైల్వే స్టేషన్

రాయలసీమ ముఖద్వారం కర్నూలు. హైదరాబాద్ - బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు సారథ్యంలోని టీడీపీ కూటమి ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తోంది. జిల్లాకు చెందిన రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ జిల్లాకు పరిశ్రమలు తీసుకొచ్చేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఎలాంటి పరిశ్రమలు రావాలన్నా రైలు మార్గాలు, జాతీయ రహదారులు, విమాయాన ప్రయాణ సౌకర్యం కీలకం. ఇప్పటికే హైదరాబాద్ - బెంగళూరు జాతీయ రహదారి ఉంది. దీనిని ఆరు లైన్ల రహదారిగా మార్చేందుకు ప్రతిపాదనలు ఉన్నాయి. కర్నూలు-చిత్తూరు వయా నంద్యాల జాతీయ రహదారి ఉంది. సూరత్ - చెన్నై వయా కర్నూలు మీదుగా జాతీయ రహదారి పనులు నిర్మాణంలో ఉన్నాయి. కర్నూలు (ఓర్వకల్లు) ఎయిర్ పోర్టు కూడా ఉంది. హైదరాబాద్, బెంగళూరుకు రైల్వేలైన్ సౌకర్యం ఉన్నా రాష్ట్ర రాజధాని అమరావతి, ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చెందుతున్న విశాఖకు కర్నూలు నగరం నుంచి రైలు మార్గం లేదు. పారిశ్రామిక, వ్యాపార అభివృద్ధికి ఇది అవరోధంగా ఉందని వ్యాపార వర్గాల వాదన. కర్నూలు - విశాఖపట్నం వయా సూర్యపేట, విజయవాడ మీదుగా సెమీ హైస్పీడ్ రైలు కారిడార్‌కు కేంద్రం ఆమోదం ముద్ర వేయడం శుభపరిణామని పలువురు చర్చించుకుంటున్నారు. ప్రతిపాదనలతో కాలయాపన చేయకుండా తక్షణం కార్యాచరణ ప్రారంభించాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

మిగతా 6లో..

అవినీతి 'జల'గల నిగ్గు తేల్చండి..!

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- ఉన్నత స్థాయి ఇంజనీర్లతో విచారణ కమిటీ వేయండి
- జలనవరుల శాఖలో నీరు-చెట్టు అవినీతిపై నివేదిక కోరిన కలెక్టరు

కర్నూలు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జల వనరుల శాఖలో నీరు-చెట్టు పేరిట గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అవినీతిపై రాష్ట్ర చిన్ననీటి పారుదల శాఖ చీఫ్ ఇంజనీరు (సీఈ)కి జిల్లా అధికారులు నివేదిక పంపించారు. కలెక్టరు పి. రంజిత్‌బాషా ఆదేశాల మేరకు తయారు చేసిన ఈ నివేదికలో చీఫ్ ఇంజనీరు స్థాయి అధికారి సారథ్యంలో విచారణ కమిటీ వేసి అవినీతి గుట్టు బయట పెట్టాలని కోరినట్లు తెలిసింది. దీంతో అక్రమాలకు పాల్పడిన ఇంజనీర్ల గుండెల్లో దడ మొదలైంది. జిల్లా జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ పరిధిలో 2014 నుంచి 2019 వరకు ఐదేళ్లలో నీరు-చెట్టు కింద రూ.1,585 కోట్లకు ఒప్పందం (అగ్రిమెంట్) జరిగితే రూ.580.37 కోట్లు ఖర్చు చేసినట్లు రికార్డుల ద్వారా తెలుస్తున్నది. చిన్నతరహా నీటి పారుదల (ఎంఐ) కర్నూలు డివిజన్ పరిధిలో కర్నూలు, ఆదోని, డోన్ సబ్ డివిజన్ల పరిధిలో దాదాపు రూ.370.36 కోట్లకు పైగా విలువ చేసే పనులకు అగ్రిమెంట్ చేశారు. 2,085 పనులకు రూ.123.16 కోట్ల బిల్లులు కాంట్రాక్టర్లకు చెల్లించారు. 2014 నుంచి 2019 వరకు రూ.71.32 కోట్లు చెల్లిస్తే.. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూలై వరకు రూ.23.29 కోట్లు, ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో రూ.28.54 కోట్ల బిల్లులు చెల్లించినట్లు తెలుస్తున్నది. అయితే.. ఇంజనీర్లు కొందరు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై నీరు-చెట్టు కింద గంపెడు మట్టి కూడా తీయకుండానే ఫోర్జరీ సంతకాలు, ఫోర్జరీ డాక్యుమెంట్లతో పనులు చేయకుండానే దొంగ బిల్లులు పెట్టి రూ.కోట్లు స్వాహా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. అదే తరహాలో మరో 17 పనులకు రూ.1.45 కోట్లకు దొంగ బిల్లులు పెట్టి కోర్టును ఆశ్రయించారు. ఈ భాగోతం వెనక వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ రంగు పూసుకొని పనులు చేసిన ఇద్దరు ముగ్గురు ఇంజనీర్ల పాత్ర ఉందనే ఆరోపణలు ఉన్నాయి. అంతేగాకుండా టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక నీరు-చెట్టు బిల్లులు చెల్లింపుల కోసం నిధులు విడుదల చేసింది. అయితే.. న్యాయస్థానం ఆశ్రయించిన కాంట్రాక్టర్లలో కంటెంప్ట్ ఆఫ్ కోర్టు (సీసీ) కేసులకు తొలి ప్రాధాన్యత, రిట్ పిటీషన్ (డబ్ల్యూపీ) కేసులకు రెండో ప్రాధాన్యత కింద బిల్లులు చెల్లించాలని, ఆ తరువాతే నాన్ డబ్ల్యూపీ బిల్లులు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు విరుద్ధంగా సీసీ, డబ్ల్యూపీ కేసులు ఉన్న బిల్లులు కాదని.. నాన్ డబ్ల్యూపీ 53 బిల్లులు చెల్లింపులు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. జలవనరుల శాఖలో జరిగిన అవినీతి కుంభకోణాన్ని ఆంధ్రజ్యోతి వరుస కథనాలతో వెలుగులోకి తెచ్చింది. ఈ కథనాలకు స్పందించిన కలెక్టరు పి. రంజిత్‌బాషా సమగ్ర నివేదిక ఇవ్వాలని జలవనరుల శాఖ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. దీంతో జిల్లా ఇంజనీరింగ్ అధికారులు కలెక్టరుకు నివేదిక ఇవ్వడమే కాకుండా చీఫ్ ఇంజనీరు (సీఈ) స్థాయి అధికారి నాయకత్వంలో విచారణ కమిటీని ఏర్పాటు చేయాలని కోరుతూ మైనర్ ఇరిగేషన్ చీఫ్ ఇంజనీరు (సీఈ) సహా జలవనరుల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) కూడా నివేదిక పంపినట్లు తెలిసింది. ప్రభుత్వం విచారణ కమిటీ వేస్తుందా..? వేచి చూడాల్సిందే.

యురేనియం తవ్వకాలను ఆపాలి

- ప్రజాభిప్రాయాన్ని కాదంటే ఆందోళనలు తీవ్రతరం
- కప్పట్రాళ్ల ప్రజలు నక్సలైట్లా? పోలీసులు బెదిరించేందుకు..
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



కప్పట్రాళ్ల గ్రామంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

దేవనకొండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్టులో యురేనియం తవ్వకాలు ఆపే శక్తి ఏపీ సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకే ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. కప్పట్రాళ్ల గ్రామంలో సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు కప్పట్రాళ్ల గ్రామస్తులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగే యురేనియం తవ్వకాలు స్థానిక నాయకులకు ఎలాంటి సంబంధం లేదని, సీఎం చంద్రబాబు, జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్ మాత్రమే దీన్ని ఆపగలరని అన్నారు. యురేనియం తవ్వకాలతో ప్రజలు అనారోగ్యాల బారినపడతారని, భూముల సారం కోల్పోయి పంటలు పండవని అన్నారు. హంద్రీ నీవా కాలువ నీటితో బంగారం పండే పొలాలు నాశనమవుతాయని రైతులు ఉద్యమం బాట పడ్డారని అన్నారు. ఆందోళనల్లో ఉన్న కప్పట్రాళ్ల ప్రజల ఇళ్లకు పోలీసులు అర్ధరాత్రి వెళ్లి బెదిరిస్తున్నారని, ఇది సరైంది కాదని, ఈ గ్రామాల ప్రజలు నక్సలైట్లు కాదని ఆయన అన్నారు. ఫ్యాక్షన్ వీడి ప్రశాంత వాతావరణంలో జీవిస్తున్న కప్పట్రాళ్ల ప్రజలను పోలీసులు ఎందుకు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి. రామచంద్రమ్మ, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు గఫూర్, సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల బెదిరింపు సరికాదు



యురేనియం తవ్వకాలతో ఉనికే ప్రశ్నార్థకంగా మారిన ప్రజలను పోలీసులు బెదిరించడం సరి కాదు. తవ్వకాలపై ప్రభుత్వం ముందుకు వెళ్తే ఉద్యమాలను ఉధృతం చేస్తాం. తవ్వకాలు జరపకుండా కేంద్ర ప్రభుత్వం అనుమతులు రద్దు చేయాలి.

-గిడ్డయ్య సీపీఐ జిల్లా కార్యదర్శి

పోలీసులు బెదిరిస్తున్నారు



మీడియా ప్రతినిధులను పత్తికొండ డీఎస్పీ అసాంఘిక శక్తులుగా వర్ణించడం తగదు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా నిలిచేది మీడియా. అర్ధరాత్రి కప్పట్రాళ్ల గ్రామంలో ప్రజల ఇళ్లకు పోలీసులు వెళ్లి యువకులను, రైతులను బెదిరించడం సరైనది కాదు.

- గఫూర్, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు

తవ్వకాలను అడ్డుకుంటాం



పచ్చని పల్లెలు యురేనియం తవ్వకాలతో నాశనం అవుతాయి. రిజర్వు ఫారెస్టు పరిధిలోని గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రజలకు అండగా ఉండి ఈ తవ్వకాలను అడ్డుకుంటాం.

-పి రామచంద్రయ్య, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు

తవ్వకాలతో జీవితాలు నాశనం



మండలంలో యురేనియం తవ్వకాలు జరిపితే ప్రజల జీవితాలు నాశనం అవుతాయి. గతంలో ముఠా కక్షలు వదిలి అభివృద్ధి దిశగా వెళ్తున్న గ్రామాల వద్ద యురేనియం తవ్వకాలు చేపట్టడం అన్యాయం. దీనితో ప్రజలు భయపడుతున్నారు.

-పి రామకృష్ణరెడ్డి, సీపీఐ నాయకుడు



జిల్లా పరిషత్ ఆవరణలోని క్వాలిటీ కంట్రోల్ కార్యాలయం

జీతాలు మహాప్రభో..!

ఉమ్మడి జిల్లా పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని క్వాలిటీ కంట్రోల్(క్యూసీ) విభాగంలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు ఇవ్వకపోవడంతో పూట గడవడం కష్టంగా మారింది. ఏడు నెలలుగా జీతాల లేక ఇటీవలి దసరా, దీపావళి పండులకు పస్తులు ఉన్నారు. ప్రతి ఏడాది మార్చి, ఏప్రిల్ నెలలో ఆ ఏడాదికి సంబంధించి సుమారు రూ. 39 లక్షల వరకు ప్రభుత్వం వారి జీతాలకు మంజూరు చేసేది. సకాలంలో ఏడాదిపాటు జీతభత్యాలు ఇవ్వడానికి సరిపోయేవి. ప్రభుత్వం స్పందించి తగిన నిధులను వెంటనే మంజూరు చేసి న్యాయం చేయాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కోరుతున్నారు.

- క్వాలిటీ కంట్రోల్ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఆవేదన
- గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతోనే..
- ఏడు నెలలుగా జీతాల కోసం ఎదురు చూపులు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి):

క్యూసీ విభాగంలో పని చేస్తున్న 9 ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఈ ఏడాది ఏప్రిల్ నెల నుంచి ఇప్పటి వరకు జీతాలు రాలేదు. ఉమ్మడి జిల్లాలో మూడు డివిజన్లు ఉన్నాయి. కర్నూలు-3, ఆదోని-3, నంద్యాల-3 ఉంటారు. ప్రతి డివిజన్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌కు ప్రతి నెల జీతం రూ.19000, ల్యాబ్ అసిస్టెంట్‌కు రూ.16800, హెల్పర్‌కు రూ.15600 ప్రభుత్వం ఇస్తోంది. ఈ మేరకు ఒక్కో డివిజన్‌కు ప్రతి ఏడాది రూ.13 లక్షలు అంటే మూడు డివిజన్లకు రూ.39 లక్షలు ప్రభుత్వం విడుదల చేయాలి. ఒక్కో డివిజన్ జీతభత్యాలకు సంవత్సరానికి రూ.6,16,800 అవుతుండగా మిగిలిన రూ.6,83,200 మిగతావాటికి ఖర్చు చేయాలి. జీతాల గురించి పలుమార్లు అడిగినా ఫలితం లేదు. కొందరు ఉద్యోగులు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు తెలిసింది. ప్రభుత్వం మంజూరు చేసే నిధుల్లో జీతాలు పోగా మిగిలిన నిధులతో శాఖ వాహనాల అద్దెలకు వినియోగించేవారు. కానీ గత వైసీపీ ప్రభుత్వం ముందస్తుగా నిధులను విడుదల చేయకపోవడంతోనే సమస్యలు వచ్చాయి. జిల్లాల వారిగా ఎక్కడికక్కడ క్యూసీ హెడ్ అకౌంట్‌కు కొంత నగదు జమ అవుతూనే ఉంటుంది. జిల్లాల ఈఈల అకౌంట్ నుంచి ఏ నెలకు ఎంత అమౌంట్ కావాలో డ్రా చేసుకుని జీతభత్యాలతోపాటు ఇతర పనులకు వినియోగించుకునేలా ఆ శాఖ ఉన్నతాధికారుల అనుమతి ఇస్తే ఏడాది పాటు సమస్య ఉండేది కాదు. కాని గత వైసీపీ ప్రభుత్వం ఎన్నికల హడావుడిలో పడి ఈ నిధులను మంజూరు చేయకుండా గాలికి వదిలేసింది. దీంతో అప్పటి నుంచి ఉద్యోగులకు ఇబ్బంది తప్పడం లేదు.

మిగతా6లో..

సామాన్య భక్తులకు

వీఐపీ తరహా దర్శనం కల్పిస్తాం

టీటీడీ బోర్డు సభ్యుడిగా మల్లెల రాజశేఖర్ ప్రమాణస్వీకారం



శ్రీవారి ఆలయంలో మల్లెల రాజశేఖర్ కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న అధికారులు

'టీటీడీ బోర్డులో స్థానం లభించడం పూర్వజన్మసుకృతం. సామాన్య భక్తులకూ వీఐపీ తరహా దర్శనమే నా మొదటి ప్రాధాన్యత. నిరీక్షణ సమయాన్ని తగ్గించేలా బోర్డులో నిర్ణయాలు తీసుకుంటాం. ఎంతో దూరం నుంచి భక్తులు ఎన్నో కష్టాలు, ఇబ్బందులతో తిరుమలకు వస్తారు. వారికి మంచి దర్శనం లభిస్తే అన్నిటిని మర్చిపోయే అవకాశముంది. టీటీడీలోని అన్ని అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకుని కీలకమైన నిర్ణయాలు తీసుకుని భక్తులకు సేవ చేస్తా. సామాన్యులకు మంచి దర్శనం, వసతే మన ప్రాధాన్యత అని సీఎం చంద్రబాబు, నారా లోకేశ్ కూడా చెప్పారు. దాన్ని తప్పకుండా అమలుచేసేందుకు కృషి చేస్తా' - మల్లెల రాజశేఖర్

6లో

జీతాలు మహాప్రభో..!

(5వ పేజీ తరువాయి)

ల్యాబ్ పరీక్షలు, ఇతర సామగ్రి కొనుగోలు, అద్దె వాహనాల బిల్లులు మొదలైన వాటికి సంబంధించిన నిధులు కూడా ఏడు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో పనులు అంతంత మాత్రంగానే జరుగుతున్నాయి. ప్రధానంగా అద్దె వాహనాల బిల్లులు మంజూరు చేయకపోవడంతో ఇబ్బందికరంగా మారింది. కూటమి ప్రభుత్వమైనా స్పందించి నిధులు మంజూరుకు అనుమతించి జీతాల వచ్చేలా చూడాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతోపాటు పీఆర్ శాఖ యంత్రాంగం అనుకుంటోంది.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం



జీతాల పెండింగ్, ఇతర నిధుల విషయంపై ప్రభుత్వానికి నివేదికలు పంపాం. ఈ ఏడాది ఏప్రిల్ నెలలోనే అనుమతి రావాల్సి ఉంది. ప్రతిసారి అడుగుతూనే ఉన్నాం. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే నగదు డ్రా చేసి ఉద్యోగులకు జీతాలను చెల్లిస్తాం. క్యూసీ పనుల్లో ఎలాంటి ఆలస్యం లేకుండా చూస్తాం.

- మురహరిరెడ్డి, క్యూసీ ఈఈ,

శ్రీశైల మల్లన్నకు వెండి వస్తువులు



దేవస్థానం అధికారులకు వెండి వస్తువులను అందజేస్తున్న దాతలు

శ్రీశైలం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానంలో స్వామి, అమ్మవార్ల కైంకర్యాల కోసం వెండి వస్తువులను రాజమహేంద్రవరానికి చెందిన కె.రామిరెడ్డి అనే భక్తుడు బుధవారం స్వామివారికి సమర్పించాడు. 790 గ్రాముల మూడు వెండి కిరీటాలు, 435 గ్రాముల వెండి పళ్ళెం, 485 గ్రాముల శఠారి ఉన్నాయి. దాతలు ఈ విరాళాన్ని అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో అధ్యాపక ఎం. పూర్ణానందం పర్యవేక్షకుడు కె. అయ్యన్నకు అందజేశారు. సమర్పణ అనంతరం దాతలకు వేదాశీర్వచనం పలికి స్వామివార్ల శేషవస్త్రాన్ని, ప్రసాదాలను అందజేసి సత్కరించారు. అదేవిధంగా నిత్యాన్నదాన పథకానికి బుధవారం హైదరాబాదుకు చెందిన చుక్కపల్లి లక్ష్మి అనే భక్తురాలు రూ.1,00,116/- విరాళాన్ని పర్యవేక్షకుడు సి. మధుసూదన్‌రెడ్డికి అందజేశారు.

బాలల మేధో వికాసానికి బాటలు

- వివిధ ప్రోగ్రామ్స్ ద్వారా టాలెంట్ వెలికితీత
- ప్రయోగాత్మక శిక్షణలతో ముందుకు పోతున్న కర్నూలు యువకుడు



వ్యక్తిత్వ వికాస శిక్షకుడు వి. సయ్యద్ మహమ్మద్ వసీ

కర్నూలు కల్చరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి):

బాలల్లో సృజనాత్మక భావాలు అంతర్లీనంగా దాగి ఉంటాయి. వాటిని గుర్తించి ప్రోత్సహిస్తే వారు అసాధ్యాలను సుసాధ్యాలుగా మార్చేసుకుంటారు. పిల్లల ఐక్యూ (ఇంటలిజెంట్ క్వోషియంట్) గుర్తించి బోధన చేయాలి. దీంతో పదో ర్యాంకు విద్యార్థిని కూడా నెంబర్ వన్ విద్యార్థితో పోటీ పడేలా చేయవచ్చు. ఇదే తీరున బాలల మేధో వికాసానికి బాటలు వేస్తున్నాడు కర్నూలుకు చెందిన యువకుడు వి. సయ్యద్ మహమ్మద్ వసీ. టీమ్ 360 డాట్ ఆర్గనైజేషన్ అనే సంస్థ ద్వారా విద్యార్థుల సృజనాత్మకతను ముందే గుర్తిస్తున్నారు. వివిధ ప్రోగ్రామ్స్ ద్వారా వారిలోని టాలెంట్‌ను వెలికితీస్తున్నారు. అంతేకాకుండా ప్రయోగాత్మక శిక్షణలతో విద్యార్థులు చదువులో ముందుకు పోయేందుకు కృషి చేస్తున్నారు.

బాలల బంగారు భవిష్యత్తుకు ఉపయుక్తంగా..



బాలలకు పుట్టుకతో వారికి ఉన్న ఇంటెలిజెన్స్, టాలెంట్ తెలుసుకొని ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు వస్తాయి. పిల్లల్లోని లోపాలను సరిదిద్దేందుకు టీమ్ 360 శిక్షణలు చాలా ఉపయోగపడతాయి. బ్రెయిన్‌లో ఉన్న లెఫ్ట్, రైట్‌లలో ఏది స్ట్రాంగ్ ఏది వీక్‌గా ఉందో తెలుసుకొని స్ట్రాంగ్‌గా ఉన్న దాన్ని ఇంకా సమర్థవంతంగా తయారు చేసే టెక్నిక్స్ అందుబాటులో ఉన్నాయి. అవి సైంటిఫిక్ పరంగానూ నిరూపితమయ్యాయి. ఇక్కడ ఇస్తున్న శిక్షణలన్నీ సైంటిఫిక్‌గా నిరూపితమైనవే. నగరంలోనూ వివిధ విద్యాసంస్థల్లో వారి ఆహ్వానం మేరకు వివిధ సందర్భాల్లో వెళ్లి విద్యార్థులు సమగ్ర ఫలితాలు రాణించేందుకు శిక్షణలు కూడా ఇస్తున్నాను.

- వి. సయ్యద్ మహమ్మద్ వసీ, టీమ్ 360 డాట్ ఆర్గనైజేషన్

చదువులో ముందుకు పోతున్నా



మొదట సెల్‌ఫోన్లు, టీవీ, జంక్ ఫుడ్‌లకు దూరంగా ఉండమని చెప్పారు. తర్వాత ప్రతి అర గంటకు ఒక గ్లాసు నీళ్లు తాగాలని సూచించారు. వాటిని పాటిస్తూ శిక్షణలు తీసుకుంటున్నా. ఫోన్, టీవీ చూడకపోవడం వల్ల నాకు చాలా సమయం కలిసి వచ్చినట్లు అవుతోంది. జ్ఞాపకశక్తి పెరుగుదలకు ఇస్తున్న సూచనలు చాలా బాగా ఉపయోగపడుతున్నాయి.

- రిషీ కేశవ, 4వ తరగతి

బాలల కోసం ప్రత్యేకంగా శిక్షణలు

మహ్మద్ వసీ కొంత కాలంగా బిర్లా గేటు సమీపంలోని కేతు జగదీష్ ప్లాజాలో 'వసీ టీమ్ 360 డాట్ ఆర్గనైజేషన్' ప్రారంభించి విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులు మానసికంగా ధృఢంగా, తమలోని ఐక్యూ సామర్థ్యాలు పెంచేలా ఈ శిక్షణ ఉపయోగపడుతున్నాయి. అలాగే పిల్లలు కళ్లకు గంతలు కట్టుకొని వస్తువులు గుర్తించే స్థాయికి తీసుకు వెళుతున్నారు. పిల్లల మేధోశక్తిని పెంచే బ్రెయిన్ స్ట్రాంగ్, రిడ్జ్ ఎనాలిసిస్ ప్రోగ్రాములు, పిల్లల్లోని లోపాలను అధిగమించడానికి, వారిలోని సామర్థ్యాలు బలోపేతం చేయడానికి మైండ్ ఎక్స్‌రేషన్, బ్రెయిట్ ఇంజనీరింగ్ ప్రోగ్రాంలను నిర్వహిస్తున్నారు. మూడు నెలల పాటు తీసుకునే ఈ శిక్షణతో విద్యార్థులు చదువులో మంచి ఫలితాలు సాధిస్తున్నారు.

సామాజిక సంఘటనలే స్ఫూర్తి...

కర్నూలుకు చెందిన మహమ్మద్ వసీ 2020లో ఎంబీఏ పూర్తి చేశారు. ఆ సమయంలో సోషల్ మీడియాలో వచ్చిన పలువురు విద్యార్థుల ఆత్మహత్యల ఘటనలు అతన్ని ఆలోచింపజేశాయి. చదువులో వెనుకబాటు, ఆత్మన్యూనతా భావన, మానసిక ఒత్తిళ్లు ఇలాంటి విద్యార్థుల రుగ్మతలకు కారణాలు అవుతున్నాయి. వాటిని నివారించేందుకు ఆతనికి జైపూర్‌లోని 'టీమ్ 360 డాట్ ఆర్గనైజేషన్' ఇచ్చే శిక్షణలు ఆకర్షించాయి. అక్కడ ఇచ్చే మైండ్ యాసెరేషన్ ప్రోగ్రాం ద్వారా మెదడులో వీక్‌గా ఉన్న న్యూరాన్స్‌ను ఎలా బలోపేతం చేయవచ్చో సైంటిఫిక్‌గా శిక్షణలతో నిరూపిస్తారు. అలాగే ఎగ్స్ట్రా సెన్సోరీ ప్రిషప్షన్ ప్రోగ్రాం ద్వారా జ్ఞాపక శక్తి పెంచుకోవచ్చు. వెంటనే అక్కడికి వెళ్లి ఏడాది శిక్షణ తీసుకున్నారు. ఈ శిక్షణ తర్వాత వివిధ విద్యాసంస్థల్లో 1500పైగా కౌన్సెలింగ్ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించారు. వసీలోని స్ఫూర్తిని గుర్తిస్తూ జైపూర్ టీమ్ 360 డాట్ ఆర్గనైజేషన్ సంస్థ ఆయన్ను ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఆ ఆర్గనైజేషన్‌కు కార్యదర్శిగా నియమించింది.

అరటి అధరహో

- టన్ను రూ.16 వేల నుంచి రూ.18 వేలు
- ఎకరాకు 20 నుంచి రూ.30 టన్నుల దిగుబడి
- రైతుల్లో వెల్లివిరుస్తున్న ఆనందం

చాగలమర్రి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడు లేనివిధంగా అరటి ధర పెరుగూ పోతోంది. గతంలో అరటి టన్ను రూ.7 వేలు నుంచి రూ.12 వేలు వరకు ధర పలికింది. ప్రస్తుతం ఎగుమతులు ఊపందుకున్నాయి. పొలం వద్ద నుంచే టన్ను రూ.16 వేలు నుంచి రూ.18 వేలు వరకు ధర చెల్లించి గెలలు తీసుకెళ్తున్నారు. గత ఏడాది డజన్ అరటి పండ్లు రూ.25 నుంచి రూ.35 వరకు పలుకగా ప్రస్తుతం డజన్ రూ.60 నుంచి రూ.80 పలుకుతోంది. సుగంధాలు గత ఏడాది టన్ను రూ.10 వేలు కాగా ప్రస్తుతం రూ.22 వేలు ధర పలుకుతున్నాయి. నంద్యాల జిల్లాలో సుమారు 10 వేల ఎకరాల్లో అరటి సాగు చేస్తున్నారు. ఎకరాకు 1200 మొక్కలు చొప్పున రూ.60 వేలు ఖర్చు చేసి నాటుతున్నారు. సరాసరి 20 నుంచి 30 టన్నులు పైగా దిగుబడి వస్తుంది. చాగలమర్రి మండలంలో 850 ఎకరాలు, ఆళ్లగడ్డలో 20 ఎకరాలు, శిరివెళ్ల 180, రుద్రవరం 480, నంద్యాల 140, ఉయ్యాలవాడ 35, పాములపాడు 35, కొత్తపల్లి 15, పాణ్యం 274, డోన్ 580, బేతంచెర్ల 280, గడివేముల 122, బండిఆత్మకూరు 220, మహానంది 6,010, బనగానపల్లె 15, కొలిమిగుండ్ల 304 ఎకరాల్లో అరటి సాగు అవుతోంది.

'సీమ' అరటికి డిమాండ్

రాయలసీమ అరటి గెలలకు మంచి డిమాండ్ ఉంది. కేరళ, తమిళనాడు, బీహార్, పశ్చిమబెంగాల్, ఢిల్లీకి చెందిన వ్యాపారులు మధ్యవర్తులచే కొని దేశ విదేశాలకు ఎగుమతులు చేస్తున్నారు. అయితే మార్కెట్ సౌకర్యం సరిగా లేకపోవడంతో అరటి రైతులు దళారులచే మోసపోతున్నారు. వ్యాపారులు చెప్పిన ధరకే తోటలను విక్రయించుకోవాల్సి వస్తోంది. టిష్యూకల్చర్ మొక్కలతో పాటు మైక్రోరిగేషన్, సమగ్ర సస్యరక్షణ, ఎరువులు, పురుగు మందుల యాజమాన్యం, ఫ్రూట్‌కేర్ యాక్టివిటీ వరకు ఒకో రైతుకు హెక్టారుకు రూ.40 వేలు వరకు ఉద్యానశాఖ ఆధ్వర్యంలో సాయం అందజేస్తోంది. దీంతో పాటు పంట సాగులో శిక్షణ ఇవ్వడం, అరటి సాగు చేసే ప్రతి రైతుకు గుడ్ అగ్రికల్చర్, ప్రాక్టీసేస్ సర్టిఫికేషన్ ఇస్తోంది. కోతల అనంతరం నిర్వహణకు అవసరమైన ప్యాక్‌హౌసేస్ కోల్డ్ స్టోరేజ్‌తో పాటు బ్రాండింగ్ విదేశాల్లో అవగాహన వంటి కార్యకలాపాలకు తోడ్పాటు అందిస్తోంది.



చిన్నవంగలిలో సాగు చేసిన అరటి తోట

ధరలతో ఊరట



8 ఎకరాల్లో అరటి సాగు చేశా. ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి పెట్టా. ప్రస్తుతం 10 టన్నులు విక్రయించా. రూ.లక్ష దాక ఆదాయం వచ్చింది. సాగుతో పాటు ధర కూడా ఆశాజనకంగానే ఉంది. ప్రభుత్వం కూడా పండ్లతోటలపై సబ్సిడీ, ఇతర ప్రయోజనాలను కల్పించాలి. -నరేంద్రరెడ్డి, రైతు, చిన్నవంగలి



అరటికి డిమాండ్ పెరిగింది

ప్రస్తుతం అరటికి డిమాండ్ పెరిగింది. నాణ్యతను బట్టి మంచి ధర లభిస్తోంది. అరటి పంట వేసిన రైతులు సీజన్ ఎంచుకొని మంచి రకం సాగు చేయాలి. పంట ఉత్పత్తి తక్కువగా ఉండటంతో డిమాండ్ బాగా ఎక్కువై ధర పెరిగింది.

- శ్రీధర్, ఉద్యానశాఖ అధికారి, ఆళ్లగడ్డ

కర్నూలు-విశాఖ మధ్య రైలు మార్గం

(5వ పేజీ తరువాయి)

కర్నూలు నుంచి విశాఖపట్నం వయా సూర్యాపేట మీదుగా ప్రతిపాదించిన సెమీ హైస్పీడ్ కారిడార్ (రైలుమార్గం)లో ఉమ్మడి నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాల్లో ఎనిమిది రైల్వే స్టేషన్లను ప్రతిపాదించారు. తెలంగాణలో ఎక్కువ భాగం రైలు మార్గం ఉంటుంది. కర్నూలు నగరం చెంతనే ఉన్న తుంగభద్ర నది, తెలంగాణలో ప్రవహించే కృష్ణా నదులపై రైల్వే వంతెనలు నిర్మించాల్సి ఉంది. ఈ రైలు వంతెనలు పర్యాటకులను ఆకట్టుకునేలా నిర్మిస్తారని అధికారులు తెలిపారు. ప్రస్తుతం కర్నూలు నుంచి విజయవాడకు చేరుకోవాలంటే ఎంత తక్కువ కాదన్నా 6 గంటలు పడుతుంది. అదే విశాఖకు చేరుకోవడానికి 8-10 గంటలకు పైగా సమయం పడుతుందని అంటున్నారు. సెమీ హైస్పీడ్ కారిడార్‌లో నడిచే రైళ్లు గంటకు 200 కి.మీ.కు పైగా వేగంతో దూసుకుపోతాయని, విశాఖకు నాలుగైదు గంటల్లో చేరుకోవచ్చని, విజయవాడకు రెండు మూడు గంటల్లో చేరుకునే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

అలా చేస్తే కర్నూలు రైల్వే జంక్షన్‌గా మారే అవకాశం

మంత్రాలయం-కర్నూలు వయా ఎమ్మిగనూరు, కోడుమూరు రైలు మార్గం ప్రతిపాదనల్లో ఉంది. ఈ రైల్వేలైన్ కోసం 1970లో ఎమ్మిగనూరు వాసి ఆనాటి కర్నూలు ఎంపీ గాదెలింగన్నగౌడ్ తొలిసారిగా పార్లమెంట్‌లో గళమెత్తడంతో పార్లమెంట్ మినిట్స్ బుక్‌లో నమోదైంది. 2004లో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో రూ.165 కోట్లు అవసరమని గుర్తించి సర్వే కోసం నిధులు ఇచ్చారు. మంత్రాలయం (తుంగభద్ర) రైల్వే స్టేషన్ నుంచి మాధవరం, మంత్రాలయం, ఇబ్రహీంపురం, నందవరం, ఎమ్మిగనూరు, ఎర్రకోట, గోనెగండ్ల, హెచ్‌కైరవాడి, వేముగోడు, కోడుమూరు, గూడూరు, నాగులాపురం, పెద్దపాడు మీదుగా కర్నూలు నగరం శివారులోని దూపాడు రైల్వేస్టేషన్ కలుపుతూ 110.70 కిలోమీటర్ల రైలుమార్గం, 14 స్టేషన్లతో అలైన్‌మెంట్ రూపొందించారు. రైల్వే ఇంజనీరింగ్, ట్రాఫిక్ సర్వేలు కూడా పూర్తయ్యాయి. సికింద్రాబాద్ దక్షిణ మధ్య రైల్వే కార్యాలయంలో ఈ రైలుమార్గం పెండింగ్‌లో ఉంది. ఈ రైల్వేలైన్ నిర్మాణం కోసం జిల్లా వాసులు ఐదు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్నారు. ఈ రైలు మార్గాన్ని నిర్మిస్తే కర్నూలు నుంచి తూర్పుకు సూర్యపేట, విజయవాడ సెమీ హైస్పీడ్ రైల్వే కారిడార్, పడమర వైపునకు కర్నూలు-మంత్రాలయం వయా ఎమ్మిగనూరు, ఉత్తర వైపునకు కర్నూలు - హైదరాబాద్ వయా గద్వాల, మహబూబ్‌నగర్, దక్షిణం వైపునకు కర్నూలు - బెంగళూరు వయా డోన్, గుత్తి రైల్వేలైన్లు సాగిపోతాయి. నాలుగు వైపుల రైలు మార్గాలతో కర్నూలు జంక్షన్‌గా మారే అవకాశం ఉంది. జిల్లా ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఆ మేరకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



విజేతలకు బహుమతి ప్రదానం

నంద్యాల క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు బుధవారం ఏఎస్పీ ఎస్.యుగంధర్‌బాబు బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి విజేతకు రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ.2 వేల చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ స్కూల్ స్థాయి నుంచే విద్యార్థులు దేశభద్రత కోసం పాటుపడాలన్నారు. సమాజంలో ప్రజల రక్షణ కోసం పోలీసులు, సైనికులు ప్రాణాలు అర్పిస్తున్నారని, వారి ప్రాణత్యాగం వల్ల అందరం సురక్షితంగా జీవిస్తున్నామని తెలిపారు. అలాంటి అమరవీరులను స్మరించుకోవడం బాధ్యత అని పేర్కొన్నారు. పోలీసుల బాధ్యతలు, వారు చేసే విధుల గురించి విద్యార్థులు తెలుసుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో పోలీసుల సవాళ్లు అనే అంశంపై పోలీస్ సిబ్బందికి నిర్వహించిన వ్యాసరచన, వక్తృత పోటీల్లో బహుమతులు అందజేశారు. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ఏఎస్పీతోపాటు రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు మంజునాథ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



బహుమతి అందజేస్తున్న ఏఎస్పీ యుగంధర్ బాబు

సహకార సంఘాలకు త్రీమెన్ కమిటీలు



కల్లూరు సహకార సంఘం

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మరో పది రోజుల్లో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు త్రీమెన్ కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేయనుందని సహకార శాఖ అధికారులు తెలిపారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు త్వరలోనే ఎన్నికలు జరిపేందుకు ఏర్పాట్లు చేస్తామని ప్రకటించింది. అయితే వివిధ కారణాల వల్ల ఎన్నికల కసరత్తు ఇప్పట్లో పూర్తయ్యే పరిస్థితులు లేవని స్పష్టం చేస్తూ సహకార సంఘాలకు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకులకు పర్సన్ ఇన్‌చార్జిలుగా అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్య పార్టీలు తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీలకు చెందిన గ్రామస్థాయి, ఇతర ముఖ్య నాయకులు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో పదవుల కోసం ఎప్పటి నుంచో కలలు కంటూ వస్తున్నారు. అయితే ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా అధికారులను సంఘాలకు, బ్యాంకులకు పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమించడంపట్ల అసంతృప్తితో ఉన్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీలోని ముఖ్య నాయకుల నుంచి ఒత్తిడి తీవ్రం కావడంతో గత వైసీపీ ప్రభుత్వంలో మాదిరిగా ఎమ్మెల్యేల సిఫారసుతో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకుకు త్రీమెన్ కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మరో పది రోజుల్లో ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు సమాచారం. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 99 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉన్నాయి. ఆయా సంఘాలకు త్రీమెన్ కమిటీలు ఏర్పాటు కాకపోవడంతో సంఘాల్లోని అధికారులు గత ఖరీఫ్‌లో పంట రుణాలను కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. వాణిజ్య బ్యాంకులతో పోలిస్తే.. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలలోనే దాదాపు 4 లక్షల మంది రైతులకు పంట రుణాలు ఇస్తున్నారు. ఈసారి ఖరీఫ్‌లో పంట రుణాల కోసం ఉమ్మడి జిల్లాలోని 99 సహకార సంఘాలకు రూ.100 కోట్లను కేటాయించారు. అయితే.. 80 శాతం సహకార సంఘాల ద్వారా రైతులకు రుణాలు అందించలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో త్రీమెన్ కమిటీలలో స్థానం సంపాదించుకోడానికి అధికార పార్టీలోని ముఖ్య నాయకులు, గ్రామస్థాయి నాయకులు తమకు తెలిసిన ఎమ్మెల్యేలు, మంత్రుల ద్వారా ప్రయత్నాలు మొదలు పెట్టారు.

టీటీడీ బోర్డు సభ్యుడిగా మల్లెల రాజశేఖర్ ప్రమాణం

ఓర్వకల్లు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడిగా నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ బుధవారం తిరుమల తిరుపతి దేవస్థానంలో ప్రమాణ స్వీకారం చేశారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మల్లెల రాజశేఖర్ తన **సతీమణి జ్యోతితోపాటు** కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు. హుశేనాపురం గ్రామానికి చెందిన మల్లెల రాజశేఖర్ గతంలో టీడీపీ హయాంలో జడ్పీ చైర్మన్‌గా, అనంతరం నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా పని చేశారు. టీడీపీ బలోపేతానికి చేసిన కృషిని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లు గుర్తించి టీటీడీ పాలక మండలి సభ్యులుగా ఎంపిక చేశారని మల్లెల రాజశేఖర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ధన్య వాదాలు తెలిపారు. తిరుమలకు వచ్చే భక్తులకు పాలక మండలి చైర్మన్, సభ్యులు మౌలిక సదుపా యాలు కల్పిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా హుశేనాపురం గ్రామ టీడీపీ నాయకులు మహబూబ్ బాషా, కేవీ మధు, శేఖరప్ప, బజారు, నాగభూషణం శెట్టి, అబ్బి, నాగరాజు, గూండాల్ నాయక్ తదితరులు మల్లెల రాజశేఖర్‌కు అభినందనలు తెలిపారు. హుశేనాపురం గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు, శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



మల్లెల దంపతులకు తిరుమల లడ్డూను అందజేస్తున్న అదనపు ఈవో

ప్రైవేట్ ఆసుపత్రిలో అగ్ని ప్రమాదం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

నంద్యాల క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నంద్యాల శ్రీనివాసనగర్ ప్రధాన రహదారిలో ఉన్న శ్రీకరి ఆస్పత్రిలో బుధవారం అగ్ని ప్రమాదం జరిగింది. ఆస్పత్రి మొదటి అంతస్తులో షార్ట్‌సర్క్యూట్ సంభవించడంతో మంటలు చెలరేగాయి. ఆస్పత్రి వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులను వారి సహాయకులు అప్రమత్తమై బయటకు తీసుకువచ్చారు. రోగులను మరో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మొదటి అంతస్తు అద్దాలను పగల గొట్టారు. అగ్నిప్రమాదం తీవ్రత అధికంగా ఉండటంతో రెండు ఫైరింజన్ల ద్వారా మంటలను ఆర్పివేశారు. ఆస్పత్రిలోని ఆపరేషన్ థియేటర్‌లోని పరికరాలు, వార్డుల్లోని ఐసీయూ వెంటిలేటర్లు, ఆపరేషన్ పరికరాలు, కంప్యూటర్లు, ఏసీలు తదితర సామగ్రి మంటలకు ఆహుతైంది. ప్రమాదంలో దాదాపు రూ.కోటి వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు ఆస్పత్రి నిర్వాహకుడు డా.విజయ్‌బాబు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

విద్యార్థిపై ఉపాధ్యాయుడి దాడి

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కర్నూలు బి.క్యాంపు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న తమ కుమారుడిపై గణిత శాస్త్రం ఉపాధ్యాయుడు దాడి చేసి గాయపరిచాడని తండ్రి మనోహర్ బాబు కర్నూలు త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ తన కుమారుడు తరుణ్ తేజ్ ఆరో తరగతి చదువుతున్నాడని తెలిపారు. ఉదయం తరుణ్‌తేజ్‌ను గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు ఆనంద్ నోట్స్ చూపించమని అడిగాడన్నాడు. ఆ సమయంలో ఆయన ఆగ్రహంతో తన కొడుకును కాలితో తన్ని, షర్ట్‌ను చింపి కొట్టాడని ఆరోపించాడు. విచక్షణా రహితంగా కొట్టడం వల్లే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నాడు. ఇదిలా ఉండగా కొన్ని సంవత్సరాలుగా ఈ పాఠశాలలో ఉపాధ్యాయుడు ఆనంద్, ప్రధానోపాధ్యాయుల మధ్య వివాదం కొనసాగుతోంది. ఇది విద్యాశాఖ అధికారులకు తలనొప్పిగా మారింది.

నమ్మించి మోసం చేశాడు..



విలేకరులతో మాట్లాడుతున్న బాధితులు

మద్దికెర, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరవలి గ్రామం ఆంధ్ర గ్రామీణ ప్రగతి బ్యాంకులో పని చేస్తున్న గోల్డ్ అబ్జర్వర్ కంసాలి చరణ్ తమను నమ్మించి మోసం చేశాడని మాజీ సర్పంచ్ వెంకటవర్మ, జి. ప్రతాప్, జిల్లా పరిషత్ పాఠశాల చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం మద్దికెరలో విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో పని చేస్తున్న చరణ్ నకిలీ బంగారం తమ ఖాతాలలో పెట్టి మోసం చేశాడన్నారు. మీ బ్యాంకు ఖాతాలో బంగారు పెట్టి మళ్లీ విడిపించుకుంటానని ఒకరికి తెలియకుండా ఒకరిని 11 మందిని నమ్మించి నకిలీ బంగారు పెట్టి రూ.18 లక్షలు తీసుకున్నాడని అన్నాడు. తీరా ఇప్పుడు బ్యాంకు అధికారులు ఆ ఖాతాల్లో ఉన్న బంగారు నకిలీదని అన్నారని వారు ఆవేదన చెందారు. బ్యాంకు వారు ఆ డబ్బు చెల్లించాలంటున్నారని వాపోయారు. పోలీసులు తమపై చర్యలు తీసుకుంటామని అంటున్నారని వారు తెలిపారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు దృష్టికి తీసుకెళ్లామని బాధితులు బోయ రంగనాథ్, హుశేన్ సాహెబ్, తిమ్మరాజు, భాస్కర్, తదితరులు తెలిపారు.

వైసీపీకి రాజీనామా

మద్దికెర, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బసినేపల్లి, మదనంతపురం గ్రామాల మాజీ సర్పంచ్ జి.ప్రతాప్, మాజీ సొసైటీ డైరెక్టర్ చిన్న నాగమ్మ వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. బుధవారం మద్దికెరలో విలేకరులతో ఆమె మాట్లాడారు. గత ఐదేళ్లుగా వైసీపీలో ఉన్న తమకు ఎటువంటి న్యాయం జరగలేదన్నారు. ఎన్నో ఏళ్లుగా పార్టీని అంటిపెట్టుకుని ఉన్నా తమకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమతోపాటు మరో పది కుటుంబాలు కూడా వైసీపీకి రాజీనామా చేశారని చెప్పారు. తామంతా ఏ పార్టీలో చేరుతామనేది తమ అనుచరులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మాజీ విద్యాకమిటీ చైర్మన్ జ్యోతమ్మ, మాజీ నీటి సంఘం ఉపాధ్యక్షులు విజయకుమార్, పార్వతమ్మ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్



బీజేపీలో చేరుతున్న వైసీపీ కౌన్సిలర్

ఆదోని టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వైసీపీకు చెందిన 11వ వార్డు కౌన్సిలర్ వాసిమ్, హవన్న పేటకు చెందిన ముస్లిం మైనారిటీ నాయకుడు ఖలీద్ అహమ్మద్ బుధవారం ఎమ్మెల్యే డా. పార్థసారథి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు వైసీపీలో సరైనా ప్రాధాన్యత లేకపోవడం, మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి సహకారం లేకపోవడంతో తనను గెలిపించిన వార్డు ప్రజలకు ఏమి చేయలేక పోయానన్నారు. పార్థసారథితోనే అభివృద్ధి సాధ్యమవుతుందని నమ్మకం కలిగి బీజేపీలో చేరానని చెప్పారు. తన పనితీరు నచ్చి బీజేపీలో చేరడానికి కొందరు క్యూ కడుతున్నారని పార్థసారథి అన్నారు. కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, సింహం నాగేంద్ర, బీజేపీ కౌన్సిలర్‌లు వెల్లాల లలితమ్మ, చిన్న సురేష్, నాయకులు ఉపేంద్ర, నాగరాజ్ గౌడ్, మల్లిక, మధు పాల్గొన్నారు.

చాగలమర్రిలో కొండచిలువ



అడ్డవాగు సమీపంలో రహదారిపై వెళ్తున్న కొండ చిలువ

చాగలమర్రి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రిలోని అడ్డవాగు సమీపంలో పాత జాతీయ రహదారిపై బుధవారం రాత్రి కొండచిలువ భయభ్రాంతులకు గురి చేసింది. స్థానిక అడ్డవాగు సమీపంలో 10 అడుగులు ఉన్న కొండచిలువ రహదారిపై వెళ్లింది. దీంతో ప్రజలు, వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. అయితే స్థానికులు కొండచిలువను హతమార్చారు.



కారుపై ఉన్న పెద్దపులి పాదముద్రను లాఠీతో చూపిస్తున్న రేంజర్ శ్రీపతినాయుడు



సంఘటనా స్థలంలో సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసరెడ్డి, అధికారులు

పెద్ద పులికి కారు ప్రమాదం

- కోతిని వెంటాడుతూ కారును తగిలి గాయపడిన పులి
- గాయాలతో నార్త్ బీట్‌లోకి..
- అహోబిళం వెళ్లే దారిలో ఈ ఘటన

రుద్రవరం/శిరివెళ్ల,నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నల్లమల రుద్రవరం నార్త్ బీట్‌లో పెద్దపులి కోతిపై దాడి చేస్తూ రోడ్డుపైకి వచ్చి వేగంగా పోతున్న కారును ఢీకొట్టి గాయపడింది. ఈ సంఘటన బుధవారం ఉదయం జరిగింది. తీవ్రంగా గాయపడ్డ పెద్దపులి అడవిలోకి వెళ్లిపోయింది. అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణానికి చెందిన గంగాధర్ ఆళ్లగడ్డ పట్టణంలో ఓ వివాహానికి వచ్చి లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వెళుతుండగా ఈ ఘటన జరిగింది. ఏపీ 02 కేడబ్ల్యు 9786 నెంబరు గల ఈ కారులో డ్రైవరు వెంకటరమణ, గంగాధర్ తన కుటుంబసభ్యులు ముగ్గురు ముగ్గురు మహిళలతో ప్రయాణిస్తున్నాడు. పెద్దపులి కారును ఢీకొట్టడంతో డ్రైవర్ భయాందోళనకు గురై కంట్రోలు చేయలేకపోయాడు. కుడి వైపు ఉన్న విద్యుత్‌స్తంభాన్ని కారు ఢీకొట్టింది. కారు ముందుభాగం నుజ్జునుజ్జు అయింది. కారుపై పెద్దపులి పాదముద్రలు పడ్డాయి. ఈ విషయం తెలిసి రుద్రవరం రేంజర్ శ్రీపతినాయుడు ఆదేశాల మేరకు డిప్యూటీ రేంజర్ ముర్తుజావలి సంఘటనాస్థలానికి సిబ్బందితో చేరుకున్నాడు. రోడ్డుపై పులి చర్మం వెంట్రుకలు కనిపించాయి. గాయపడి నార్త్ బీట్‌లోకి వెళ్లిన పెద్ద పులి కోసం ఫారెస్టు అధికారులు గాలింపు చేపట్టారు. ఆత్మకూరు, శ్రీశైలం, నంద్యాల నుంచి ప్రత్యేక బృందం రంగంలోకి దిగింది. టైగర్ ప్రాజెక్టులోని రీసెర్చర్ శ్రీధర్ ఆధ్వర్యంలో బృందం అడవిలోకి వెళ్లింది. సంఘటనాస్థలానికి డిప్యూటీ డైరెక్టరు అనురాగ్ మీనా పెద్దపులిని కారు ఢీకొట్టిందన్న సమాచారం అందడంతో నంద్యాల డిప్యూటీ డైరెక్టరు అనురాగ్ మీనా రుద్రవరం సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెద్ద పులి కూర్చుని గీకిన చెట్టును, మలమూత్రాలు గుర్తించామన్నారు. సుమారు 10 నుంచి 11 కెమెరా ట్రాప్‌లు ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. డ్రోన్‌తో పెద్దపులి లోకాలిటీ గుర్తించేందుకు ఉన్నతాధికారుల అనుమతి కోరుతామని చెప్పారు. అటవీ ప్రాంతంలో వాహనాలు 20 కి.మీ వేగంతో వెళ్లాలన్నారు. అతివేగంతో వెళితే వన్యప్రాణులకు ప్రమాదం వాటిల్లుతుందన్నారు.



ప్రత్యేక వాహనంలో తీసుకువచ్చిన పెద్దపులి బోను



మాట్లాడుతున్న ఎఫ్‌డీపీటీ

సభలో అనధికార వ్యక్తులు

- దర్జాగా కూర్చున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు
- ప్రజాప్రతినిధులకు బదులు భర్తలు హాజరు
- గందరగోళంగా మండల సర్వసభ్య సమావేశం
- నాకు 30 శాతం పనులు ఇవ్వాల్సిందే
- అన్నీ టీడీపీ వాళ్లకంటే కుదరదు: ఎమ్మెల్యే విరుపాక్షి



సమావేశానికి హాజరైన వైసీపీ నాయకులు

ఆలూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆలూరు మండల సర్వసభ్య సమావేశం వైసీపీ సభగా మారింది. బుధవారం ఎంపీపీ రంగమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎంపీటీసీ, సర్పంచ్‌లు హాజరు కావాల్సి ఉండగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే మహిళా ప్రజాప్రతినిధులకు బదులు భర్తలు హాజరయ్యారు. కొందరు అనధికార వ్యక్తులు మైక్‌లు తీసుకొని ప్రసంగాలు కూడా చేశారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో సమావేశం గందరగోళంగా మారింది.

● నాకు పనులు ఇవ్వాల్సిందే..

ఆలూరు ఎమ్మెల్యేగా గెలిచిన తనకు నియోజకరవ్గంలో 30 శాతం పనులు ఇవ్వాల్సిందేనని ఎమ్మెల్యే విరుపాక్షి అన్నారు. అన్ని టీడీపీ వాళ్లకు ఇస్తే తమ పార్టీ కార్యకర్తలు ఏం కావాలంటూ అధికారులను నిలదీశారు. గోకులం షెడ్లు, పల్లె పండుగ పనులు మొత్తం వీరభద్ర గౌడ్ చెప్పిన వాళ్లకు ఎలా ఇస్తారని మండిపడ్డారు. ఈ విషయం కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇక మీదట అలా జరిగితే బాగుండందని హెచ్చరించారు. గత వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ ఎంపీటీసీలమని మండల గ్రాంట్ కింద ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని తుంబలబీడు ఎంపీటీసీ రమేష్, మొలగవల్లి ఎంపీటీసీ సుమతీ భర్త బంగారు పటేల్ యాదవ్ అన్నారు. ఎందుకు ఇవ్వలేదో అప్పుడున్న ఎమ్మెల్యే జయరాంను అడగాలని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. ఇక మీదట పార్టీలకు సంబంధం లేకుండా పనులు ఇవ్వాలని ఎంపీపీకి సూచించారు. ఆలూరు చెరువుల్లో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లు నిర్మించాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఐదు నెలలవుతున్నా నిధులు లేవని, సర్పంచులు, ఎంపీటీసీలు దండయాత్రకు సిద్ధం కావాలని అందుకు తాను మద్దతుగా ఉంటానన్నారు. సమావేశంలో జడ్పీటీసీ ఏరూర్ శేఖర్, డిప్యూటీ తహసీల్దార్ విజయ్ కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యనారాయణ, వైస్ ఎంపీపీలు నాగవేణి, శ్రీరాములు, కోఆప్షన్ సభ్యులు బాషా పాల్గొన్నారు.

అదే రోజు చెల్లించడానికి అభ్యంతరం లేదు

- కమీషన్ ఏజెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డులో రైతులు పంట ఉత్పత్తులు అమ్మిన రోజే చెల్లింపులు చేయడానికి తమకు ఎలాంటి అభ్యంతర లేదని కమీషన్ ఏజెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అన్నారు. బుధవారం ద్వారక ఫంక్షన్ హాలులో వారు మాట్లాడారు. ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి మార్కెట్ యార్డులో పర్యటించి కమీషన్ ఏజెంట్లు రైతులను దోపిడీ చేస్తున్నారని, గిట్టుబాటు ధర కల్పించడం లేదని ఆరోపించడం సబబు కాదన్నారు. తాము వ్యాపారులకు రైతులకు మధ్యవర్తులుగా ఉంటూ రైతు తెచ్చిన దిగుబడిని అమ్మిస్తున్నామని చెప్పారు. అందుకు తాము కమీషన్ మాత్రమే తీసుకుంటున్నామని, ఎక్కడ కూడా వడ్డీ తీసుకోవడం లేదని, ఇతర కత్తిరింపులు చేయడం లేదన్నారు. రైతుల దిగుబడి కొనుగోలు చేసిన రోజే వ్యాపారులు డబ్బులు ఇవ్వడం లేదని, దీంతో తాము బ్యాంకుల్లో ఓడీలు తీసుకొని, తమ ఆస్తి పత్రాలను తనఖా పెట్టి రైతులకు చెల్లింపులు చేస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే వ్యాపారులతో మాట్లాడి కమీషన్ ఏజెంట్లకు సరుకు కొనుగోలుకు చేసిన రోజే చెల్లించేలా చూడాలని కోరారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ), మార్క్‌ఫెడ్‌లు కూడా రైతులకు వెంటనే డబ్బులు చెల్లించడం లేదని, వారం నుంచి పది రోజులు పడుతోందని అన్నారు. అలాంటిది కోట్ల రూపాయల లావాదేవీలు జరిగే మార్కెట్ కమిటీలో అదే రోజు చెల్లింపులు చేయాలని ఆదేశించడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా తమ సమస్యలను ఎమ్మెల్యే విని పరిష్కరించాలని కోరారు. సమావేశంలో కమీషన్ ఏజెంట్లు బత్తిని నాగేంద్ర, నారాయణరెడ్డి బాలాజీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమీషన్ ఏజెంట్స్ అధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి

'పది' విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్యూల్ పాల్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షలకు సంబంధించి మెరుగైన ఫలితాల కోసం కలెక్టర్ మార్గదర్శకాలను జారీ చేశారని చెప్పారు. అకాడమిక్ సందేహాలను వివరించడానికి స్టడీ అవర్స్‌లో ఉపయోగపడతాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించినట్లు డీఈవో తెలిపారు.

డ్రోన్ పాలసీకి క్యాబినెట్ ఆమోదం

ఓర్వకల్లు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లులో 300 ఎకరాల్లో డ్రోన్ పాలసీ తయారీకి బుధవారం క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. రూ.1000 కోట్ల పెట్టుబడుల సాధనే లక్ష్యంగా డ్రోన్ పాలసీ -2024-2029 ఏపీ డ్రోన్ కార్పొరేషన్ రూపొందించింది. డ్రోన్ రంగంలో 40వేల ఉద్యోగాల కల్పన, రూ.3వేల కోట్ల రాబడి లక్ష్యంగా క్యాబినెట్ నిర్ణయించింది. ప్రపంచ డ్రోన్ డెస్టినేషన్‌గా ఏపీ డ్రోన్ హబ్‌గా ఓర్వకల్లు కానుంది. 300 ఎకరాల్లో డ్రోన్ తయారీ టెస్టింగ్, ఆర్ అండ్ డీ ఫెసిలిటీ ఏర్పాటు చేయనున్నారు. 25వేల మందికి డ్రోన్ పైలెట్లుగా శిక్షణ ఇవ్వనున్నారు. రాష్ట్రంలో 20 రిమోట్ పైలెట్ ట్రైనింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు క్యాబినెట్‌లో తీర్మానిం చారు. 50 డ్రోన్ నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పా టు చేయనున్నారు. డ్రోన్ రంగంలో పరిశోధనలు చేపట్టే విద్యాసంస్థలకు రూ.20 లక్షల ప్రోత్సాహం అందించనున్నట్లు క్యాబినెట్‌లో తీర్మానించారు.

కార్తీక దీపోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని సంకల్ బాగ్‌లో ఈనెల 15న నిర్వహించనున్న కార్తీక దీపోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. బుధవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఆయన చాంబర్‌లో నగరపాలక, ఫైర్, విద్యుత్, ట్రాన్స్‌కో, జలవనరుల, మత్స్యకార, పోలీసు శాఖల అధికారులతోపాటు కార్తీక దీపోత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కార్తీక దీపోత్సవం రోజు ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని, లైటింగ్, మహిళా పోలీసు, గజ ఈత గాళ్లు, ఫైరింజన్ వంటి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, ఎంహెచ్‌వో కే.విశ్వేశ్వరరెడ్డి, ఎస్‌ఈ రాజశేఖర్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని రూరల్ నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక మద్యం అక్రమంగా తరలిస్తున్న పెద్దహరివాణం గ్రామానికి చెందిన గాదిలింగప్పను ఇస్నీ పోలీసులు అరెస్టు చేశారు. ద్విచక్ర వాహనంలో బుధవారం మద్యాన్ని తరలిస్తుండగా, ఎల్లెల్సీ కెనాల్ వద్ద అదుపులో తీసుకొని అతని వద్ద నుంచి 15 మద్యం బాక్సులను స్వాధీనం చేసుకున్నారు. ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ నాగేంద్ర తెలిపారు.

రోగులకు అందుబాటులో ఔషధశాల

- త్వరలో క్యాజువాలిటీ సమీపంలోకి మార్పు



మందుల కౌంటర్‌ను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఔషధశాలను (మందులు ఇచ్చే కౌంటర్) ఓపీ రోగులకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపడుతున్నట్లు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డా.కె. వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ఆయన ఆసుపత్రిలోని పలు విభాగాల్లో రౌండ్స్ నిర్వహించారు. గైనిక్ బ్లాక్ వద్ద ఉన్న ఔషధశాల ఓపీ నెంబర్ 13ను ఆయన తనిఖీ చేశారు. మందులు ఇచ్చే కౌంటర్‌ను అక్కడ పని చేస్తున్న ఫార్మసిస్టు సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రేకుల షెడ్డు వల్ల ఎండవేడిమికి కొన్ని మందులు చెడిపోతున్నాయని సూపరింటెండెంట్ దృష్టికి తెచ్చారు. కొందరు ఓపీ రోగులు మందుల కౌంటర్ చాలా దూరంగా ఉందని సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో ఉన్న ఓపీ కేంద్రాల వద్దనే మందుల కౌంటర్ ఉండాలని ఆయన దృష్టికి తెచ్చారు. అనంతరం సూపరింటెండెంట్ ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ శివకుమార్‌తో కలిసి మందుల కౌంటర్‌కు అనువైన స్థలాన్ని పరిశీలించారు. నిరూపయోగంగా ఉన్న నర్సెస్ అసోసియేషన్ భవనంలో మందుల కౌంటర్‌ను ఏర్పాటు చేసేలా ఎస్టిమేషన్ వేయాలని ఈఈని ఆదేశించారు. అలాగే మరో స్థలాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు సూపరింటెండెంట్ తెలిపారు.

బాలిక మృతదేహం లభ్యం

కర్నూలు క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేసీ కెనాల్‌లో గల్లంతైన షేకూన్ బీ బాలిక మృతదేహాన్ని బుధవారం ఉదయం లభ్యమైంది. మంగళవారం కేవీఆర్ కళాశాల వద్ద కేసీ కెనాల్‌లో ప్రమాదవశాత్తు జారి పడి షేకూన్‌బీ గల్లంతైంది. బుధవారం ఉదయం జొహరాపురం ఉదయం నీటిలో తేలుతూ గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆ మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. షేకూన్‌బీ తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైసీపీ నాయకుడిపై దాడి

కర్నూలు క్రైం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శ్రీరామ్‌నగర్‌కు చెందిన వైసీపీ లీడర్ ముస్తాఫాపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ముస్తాఫా మంగళవారం రాత్రి గణేష్‌నగర్‌లోని రామచంద్ర మిషన్ వద్ద వెళ్తుండగా.. ఆరుగురు గుర్తు తెలియని వ్యక్తులు ముస్తాఫాకు ముసుగు వేసి కొట్టారు. తీవ్రంగా గాయపడిన ఆయనను చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించారు. బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ నాయకుల భూ కబ్జా

- న్యాయం చేయాలని బాధితుల బైఠాయింపు



మండగిరిలోని సర్వే నెంబర్ 352లోని పత్రాలను చూపెడుతున్న బాధితులు

ఆదోని, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తమ తాత ముత్తాతల వారసత్వంగా వస్తున్న భూమిని వైసీపీ నాయకులు ఆక్రమించేశారని చంద్ర య్య, వీరాంజనేయులు అనే వ్యక్తులు వాపోయారు. ఆదోని పట్టణంలోని మండగిరిలోని సర్వే నెంబర్ 352లోని భూమిని వైసీపీ నాయకులు ఆక్రమించుకున్నారని చంద్రయ్య, వీరాంజనేయులు బుధవారం ఆందోళనకు ది గారు. సర్వే నెంబర్ 352లో నిర్మాణ పనులు చేపట్టేందుకు వైసీపీకి చెందిన రామకృష్ణారెడ్డి, ఈశ్వర్ రెడ్డి, వెంకటేశ్వ రెడ్డి వెళ్లారు. తమ తాత మూ లింటి హుస్సేనప్ప నుంచి రెండెకరాల పొలం, కొత్తింటి నరసమ్మ నుంచి మరో ఎకరా పొలం తమకు వచ్చినందని చంద్రయ్య, వీరాంజనేయులు ఆందోళనకు దిగారు. 1962లో ఈ భూమి కొన్నట్లు తమ దగ్గర రిజిస్ట్రేషన్ పత్రాలు ఉన్నాయని బాధితులు వారికి చూపించారు. అయితే ఈ పొలాన్ని కర్రిబసమ్మ నుంచి చంద్రకాంతమ్మ అనే మహిళ కొనుగోలు చేసిందని, ఆమె అమిద్, అబీద్ అనే వారికి విక్రయిస్తే.. వారి నుంచి తాము కొన్నామని వైసీపీ నాయకులు రామకృష్ణారెడ్డి తెలిపారు. తమ భూమిని రామకృష్ణారెడ్డి కాజేశారని, ఎమ్మెల్యే పార్థసారథి న్యాయం చేయాలని బాధితులు అక్కడే బైఠాయించారు.

దేవదాయ శాఖలో రూ.1.67 లక్షల దోపిడీ

- ఈవో శ్రీనివాసరెడ్డిపై క్రిమినల్ చర్యలకు ఆదేశం

కర్నూలు అర్బన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖలో ఈవోగా పని చేసిన శ్రీనివాసరెడ్డి రూ.1.67 కోట్ల నిధులను సొంత ఖాతాలోకి మళ్లించుకొని అక్రమాలకు పాల్పడినట్లు అసిస్టెంట్ కమిషనర్ సుధాకరరెడ్డి తెలిపారు. నంద్యాల మండలం ఊరుమల్పూరం గ్రామంలోని రామేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి రూ.20,16,440 లక్షలు, కర్నూలు అసిస్టెంట్ కమిషనర్ చెక్ బుక్ దొంగిలించి ఫోర్జరీ సంతకాలతో తన వ్యక్తి గత ఖాతాల్లోకి రూ. 86,65,760 నిధులు మళ్లించినట్లు గుర్తించామని తెలిపారు. సదరు ఈవోపై నగరంలోని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేసి క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

వార్డు సచివాలయాల్లో రాజకీయ బదిలీలు

ఆందోళనలో ఉద్యోగులు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలోని సచివాలయాల్లో రాజకీయ ఒత్తిళ్లతో బదిలీలు జరుగుతున్నాయి. గత నెల 30న ఆరు గురు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలను బదిలీ చేస్తూ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆర్‌సీ. నెంబరు ఏ2/32128/19 ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఇదంతా రాజకీయ ఒత్తిళ్లతో జరిగిందని కొందరు ఉద్యోగులు బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. ఈ క్రమంలో పరిపాలన సౌలభ్యం కింద బదిలీ చేసినట్లు కమిషనర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ బదిలీలన్నీ కేవలం కల్లూరు 16 వార్డు పరిధిలో జరగడం గమనార్హం. ఇందిరమ్మ కాలనీ సచివాలయంలో అడ్మిన్ సెక్రటరీగా పని చేస్తున్న సయ్యద్ కరీంను మాధవనగర్-2 సెక్రటరీగా, ఇక్కడ పని చేస్తున్న మహబూబ్ బాషాను ఇందిరమ్మ కాలనీ, బి.క్యాంపు సచివాలయంలో పనిచేస్తున్న కే. సురేష్‌ను శారద నగర్-1కి అక్కడ విధులు నిర్వహిస్తున్న హరి ప్రియను బి.క్యాంపు సచివాలయానికి బదిలీ చేశారు. అదేవిధం గా వీకర్‌సెక్షన్ కాలనీ-2లో విధులు నిర్వహిస్తున్న తెలుగు రాజశేఖర్‌ను ఏపీ హౌసింగ్ బోర్డు కాలనీకి, ఇక్కడ విధుల నిర్వహిస్తున్న కేజేజే చైతన్యను వీకర్ సెక్షన్ కాలనీకి బదిలీ చేశారు. నగర పాలక సంస్థ పరిధిలో 135 సచివాలయలో ఉన్నాయి. అయితే కేవలం 16 వార్డు సచివాలయాల్లో ఆరు గురు అడ్మిన్ సెక్రటరీలో మాత్రమే బదిలీ చేయడం ఏమిటని కొందరు ప్రశ్నిస్తున్నారు.

● సెక్రటరీలు కోరిన చోటికే బదిలీలు..

సెక్రటరీలు కోరిన చోటికే బదిలీలు జరిగినట్లు కార్యాలయంలో చర్చిం చుకుంటున్నారు. ఈ వార్డులలో కేవలం రాజకీయ ఒత్తిళ్ళతోనే మార్పులు జరిగినట్లు సచివాలయ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ప్రజాప్రతినిధుల సిఫారసు ఉన్న సెక్రటరీలను వారు కోరిన స్థానాలకు బదిలీ చేశారని తెలుస్తోంది. నిజంగా బదిలీలు చేయాల్సి వస్తే నిబంధనలు పాటించాలని కొందరు చెబుతున్నారు.



కర్నూలు నగర పాలక సంస్థ కార్యాలయం

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి: గౌరు చరిత

కల్లూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కల్లూరు అర్బన్ 16 వార్డుల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలోని ఎస్‌బీఐ కాలనీ న్యూ కౌన్సిల్ హాల్లో ఆమె 16 వార్డుల అభివృద్ధి నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆధ్వర్యంలో ఇంజనీర్లు, అధికారులు, సచివా లయ అడ్మిన్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ కల్లూరు అర్బన్ వార్డుల పరిధిలో కౌన్సిల్ తీర్మానించిన పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. అర్బన్ వార్డుల్లో తాగునీటికి ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. పార్క్ స్థలాల్లో ఇళ్లపట్టాలు ఎలా ఇస్తారని తక్షణమే పార్క్‌లు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. నగరంలో పగటి పూట తాగునీటి సరఫరా సమయం పెంచాలని, పారిశుధ్య సిబ్బందిని పెంపునకు చర్యలు తీసుకోవాలన్నారు. పందిపాడు, లక్ష్మీపురం గ్రామాలకు హంద్రీనీరే శరణ్యమని అక్కడ ప్రజలకు నుగరనీరు సరఫరా చేస్తున్నారని ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. ఆ గ్రామాల్లో నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకో వాలని అధికారులను ఆదేశించారు. పందిపాడులో లోఓల్టేజీ సమస్య వేధిస్తుందని వార్డు నాయకులు ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం కమిషనర్ ఎస్.రవీంద్రబాబు మాట్లాడుతూ అర్బన్ వార్డుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. తాగునీటి సరఫరాకు ప్రాధాన్యం ఇస్తామని, వార్డులో చేప డుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, ఎస్‌ఈ రాజశేఖర్, ఎంఈ శేష సాయి, ఆరోగ్యశాఖ అధికారి డా. విశ్వేశ్వరరెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, మేనేజర్ చిన్నరాముడు, కల్లూరు అర్బన్ వార్డుల కన్వీనర్ పెరుగు పురుషోత్తంరెడ్డి, నంద్యాల జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు కె. పార్వతమ్మ, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్, టీడీపీ వార్డు ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



ఎంపీ నాగరాజును సన్మానిస్తున్న నాయకులు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్-డీఓటీ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. బుధవారం కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజును ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సర్కిల్ అధ్యక్షుడు యాకోబు మాట్లాడుతూ వేతన సవరణతో సంబంధం లేకుండా పెన్షన్ రివిజన్ చేయాలని, సీనియర్ సిటిజన్లకు రైల్వేలో రాయితీలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రామలింగం, ఉపాధ్యక్షుడు మద్దిలేటి, జిల్లా కార్యదర్శి ఎల్.విజయభాస్కర్, సహాయ కార్యదర్శి డి.వెంకటరామిరెడ్డి, కోశాధికారి ఖాజామోద్దీన్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

కర్నూలు హాస్పిటల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలో ఎన్టీఆర్ నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్, బ్యూటీకేర్‌లో శిక్షణ పొందిన మహిళలకు కర్నూలు ఎంపీ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మహిళా సాధికార కేంద్రం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వం మహిళలకు ఇచ్చే ఉచిత శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళ ప్రాంగణం అధికారి అంజనిభూషణ్, టీడీపీ వీరశైవ సాధికారత సమితి కన్వీనర్ ఎస్‌వీ శివరాజ్ పాల్గొన్నారు.

అంతర్గత క్రీడా పోటీలు ప్రారంభం

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పాతనగరంలోని సిరాక్ పాఠశాల క్రీడా మైదానంలో అంతర్గత క్రీడా పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఉర్దూ విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యులు, ప్రైవేటు పాఠశాలల యజమాన్యం కర్నూలు జిల్లా గౌరవాధ్యక్షులు, పాఠశాల అధినేత జీఎండీ ఇబ్రహీం, ప్రధానోపాధ్యాయురాలు వజీరా ఖాతూన్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అనంతరం బాలల దినోత్సవంలో భాగంగా ఇంట్రామ్యురల్ స్పోర్ట్స్ మీట్ కబడ్డీ, ఖో-ఖో, రన్నింగ్ రేస్, మ్యూజికల్ చైర్స్, బాల్‌గేమ్స్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్ఎం మేరీ స్వప్న, వ్యాయామ ఉపా ధ్యాయులు కొండేపోగు చిన్న సుంకన్న, ఉపాధ్యాయులు మజర్, నసీమా పర్వీన్, రమాదేవి, కనకదుర్గ, నజీమా, భాగ్యలక్ష్మి, అరుణ, షేకూన్‌బీ, కాజోల్, శమంతకమణి, రమ్యశ్రీ, శ్రావణి, ఉమామహేశ్వరి, సబీరా, కుస్‌నూర్, సాజీదా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-17 బాలబాలికలకు నెట్‌బాల్ జట్టు పోటీలకు సిద్ధం కావాలని ఉమ్మడి జిల్లాల కార్యదర్శులు గిడ్డయ్య, శ్రీనాథ్ తెలిపారు. ఈ నెల 10 నుంచి 12 వరకు నెల్లూరులోని ఆత్మకూరులో నిర్వహించే రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు హాజరు కావాలని తెలిపారు. 8వ తేదీలోపు స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎలిజిబిలిటి ఫామ్‌పై సంతకాలు చేసుకోవాలన్నారు.

వెయిటేజీ మార్కులు ప్రకటించాలి: ఆప్టా

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో సమగ్ర శిక్షలో పని చేస్తున్న సీఆర్పీ, కో-ఆర్డినేటర్లకు, సీఆర్టీలకు వెయిటేజీ మార్కులు ప్రకటించాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) రాష్ట్ర అధ్యక్షుడు గణపతిరావు, రాష్ట్ర ప్రధానా కార్యదర్శి కాకి ప్రకాశ్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చాలా సంవత్సరాల తర్వాత నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయబోతున్న మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌లో సమగ్ర శిక్షలో పని చేస్తున్న ఉద్యోగులకు వెయిటేజీ మార్కులు ప్రకటించినట్లయితే లబ్ధి పొందుతారని అన్నారు.

రేపు విద్యుత్ చార్జీలపై కాంగ్రెస్ నిరసన

కర్నూలు అర్బన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సర్దుబాటు చార్జీలను తగ్గించాలని కోరుతూ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో రేపు నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు డీసీసీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఎస్‌ఈ కార్యాలయం ఎదుట సాయంత్రం 6 గంటలకు లాంతర్లతో నిరసన కార్యక్రమం చేపడతామన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు విద్యుత్ చార్జీల భారం ప్రజలపై వేయమని చెప్పిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లాలో అన్ని నియోజకవర్గాల సమన్వయకర్తలు, సిటీ కాంగ్రెస్, అనుబంధ సంఘాలు, ఎన్ఎస్‌యూఐ, ఐఎన్‌టీయూసీ కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జాబ్‌మేళాలో 32 మంది అభ్యర్థుల ఎంపిక

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్కిల్ డెవలప్‌మెంట్, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాలో 32 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని కలెక్టర్ పి.రంజిత్ బాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు టాటా క్యాపిటల్, ఎస్‌వీసీ సినిమాస్, శ్రీరామ్ చిట్స్ అండ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఎంపికయ్యారు. రూ.20వేల వేతనంతో మేనేజర్ పోస్టుకు ఒకరు, రూ. 16,400 వేతనంతో క్రెడిట్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు 12 మంది, రూ.13వేల వేతనంతో ఆపరేషన్ అసోసియేట్ పోస్టులకు ఆరుగురు, 15వేల వేతనంతో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు 13 మంది ఎంపికయ్యారని ఆయన తెలిపారు.

స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పించాలి

ఓర్వకల్లు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జైరాజ్ ఇస్పాత్ (స్టీల్ ప్లాంటు) పరిశ్రమలో స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం గుట్టపాడు గ్రామ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న జైరాజ్ ఇస్పాత్ ఉక్కు పరిశ్రమ మెయిన్‌గేటు వద్ద భూనిర్వాసితుల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. పరిశ్రమలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా.. పోలీసు సిబ్బంది అడ్డుకున్నారు. పరిశ్రమల అధికారులకు వినతి పత్రం సమర్పించగా.. 15 రోజుల్లో సమస్యను పరిష్కరించి స్థానిక యువతకు ఉద్యోగాలు, రైతులకు నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, భూనిర్వాసిత కమిటీ నాయకులు కృష్ణారెడ్డి, రాధాకృష్ణ మాట్లాడుతూ జైరాజ్ ఇస్పాత్ (స్టీల్ ప్లాంటు) పరిశ్రమలో భూములు కోల్పోయిన రైతు కుటుంబంలో ఒక్కరికీ ఉద్యోగం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాగన్న, షాజహాన్, మద్దిలేటి, కృష్ణుడు, ఉండమయ్య, మహ్మద్ బాషా, శివకుమార్, బాలమద్దిలేటి, నాగోషులు, షేక్షావలి, సుధాకర్, రామాంజనేయులు, రైతులు, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు, గ్రామస్థులు

గ్రామ సభలతో సమస్యల పరిష్కారం

రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ లోకేశ్వర రెడ్డి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



గూడూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామ సభలతో రైతుల సమస్యలు పరిష్కారం అవుతాయని రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ ఎం.లోకేశ్వర రెడ్డి అన్నారు. బుధవారం గూడూరులోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రశ్న: గ్రామ సభలను ఎన్ని గ్రామాల్లో నిర్వహించారు.

జవాబు: గత నెల 18వ తేదీ నుంచి 30 వరకు మండలంలోని తొమ్మిది గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించాం.

ప్ర: రైతుల నుంచి ఎన్ని అర్జీలు వచ్చాయి.

జ: గ్రామ సభల్లో రైతుల నుంచి 205 అర్జీలు వచ్చాయి.

ప్ర: ఎన్ని అర్జీలకు పరిష్కారం చూపారు.

జ: గ్రామసభల్లో అర్జీలను స్వీకరించాం. వీటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి రైతుల అంగీకారంతో సమస్యలకు పరిష్కారం చూపుతాం.

ప్ర: రైతుల నుంచి ఎలాంటి సమస్యలపై అర్జీలు వచ్చాయి.

జ: పొలం విస్తీర్ణం, జాయింట్ ఎల్‌పీ వంటి సమస్యలపై అర్జీలు వచ్చాయి. వీటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తాం.

నీటి ట్యాంకులను శుభ్రపరచాలి



నీటి ట్యాంకును పరిశీలిస్తున్న డీపీవో భాస్కర్

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఉన్న నీటి ట్యాంకులను శుభ్రపరచాలని జిల్లా పంచాయితీ అధికారి భాస్కర్ అధికారులను ఆదేశించారు. బుధవారం నాగు లాపురం, పెంచికలపాడు గ్రామాల్లో నీటి ట్యాంకులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి ట్యాంకుల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, నీరు వృథా కాకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. నీటి ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రైవేటీకరణ ఆపకుంటే ఆటోల బంద్

కర్నూలు న్యూసిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆర్టీఓ కార్యాలయం ప్రైవేటీకరణ ఆపకుంటే నగరంలో ఆటోలకు బంద్‌కు పిలుపునిస్తామని ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.ప్రభాకర్ హెచ్చరించారు. బుధవారం ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్ యూనియన్, సీఐటీయూ, ఆటో యూనియన్ ఆధ్వర్యంలో డ్రైవర్లు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్సులను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకువ చ్చిన కొత్తరూల్స్‌ను అమలు చేయరాదన్నారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, విజయ్, దూదెకొండ కుమార్, వెంకటస్వామి, రామమద్దయ్య పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపిక

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఈ విద్యాసంవత్సరం లో 141 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 4.5 లక్షల ప్యాకేజీతో 116 మంది విద్యార్థులు యాక్సెస్ కంపెనీకి ఎంపికయ్యారన్నారు. రూ.6.70 లక్షల ప్యాకేజీతో 8 మంది విద్యార్థులు, రూ.4.20లక్షల ప్యాకేజీతో 9 మంది విద్యార్థులు కాన్విజెంట్ కంపెనీకి, రూ.4లక్షల ప్యాకేజీతో ఏడుగురు విద్యార్థులు కప్జెయస్ కంపెనీకి, ఒక విద్యార్థి అసెట్సెన్స్ కంపెనీలో రూ.8లక్షల ప్యాకే జీకి ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్, ప్లేస్‌మెంట్ డీన్ డా.గోవర్ధన్ రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

గ్రామ సభలను వినియోగించుకోండి

కల్లూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామసభలను రైతులు వినియోగించుకోవాలని కల్లూరు తహసీల్దారు కె.ఆంజనేయులు అన్నారు. బుధవారం చిన్నటేకూరు గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం తహసీల్దారు అంజనేయులు రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు.

బాక్సింగ్ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థినులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

కర్నూలు రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కర్నూలు రూరల్ మండలం ఉల్చాల జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. బుధవారం పాఠశాలలో విద్యార్థులను హెచ్ఎం సర్తాజ్ ఉన్నిసాబేగం, ఉపాధ్యాయురాలు అరుణ, వ్యాయామ ఉపాధ్యాయులు సిరాజ్, భాస్కర్ యాదవ్ అభినందించారు. ఈసందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ జిల్లా స్థాయి బాక్సింగ్ అండర్ 17 బాలికల క్రీడా పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విష్ణుప్రియ, రాణి, ప్రసన్నకుమారి, అమూల్య, సమ్మురిన్‌లు జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రీడాల్లోను రాణించాలని సూచించారు.

పైప్‌లైన్ పనులను వేగవంతం చేయండి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సుంకేసుల జలాశయం నుంచి మునగాల పాడు వరకు రూ.82కోట్లతో నిర్మిస్తున్న పైప్‌లైన్ పనులను వేగవంతం చేయాలని కమిషనర్ రవీంద్ర బాబు ఆదేశించారు. బుధవారం సుంకేసుల జలాశయం వద్ద ఇంటెక్ వెల్, పైప్‌లైన్ పనులను పబ్లిక్ హెల్త్ అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. అలాగే రాజవిహార్ సమీపంలో జడ్పీ పరిపాలన భవనం వెనుక ఉన్న హంద్రీ నదిని కమిషనర్ పరిశీలించారు. ఆయన వెంట పబ్లిక్ హెల్త్ ఈఈ చంద్రమోహన్, డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ నాగశేఖర్, ఏజెన్సీ ఇంజనీర్ సుబ్బయ్య ఉన్నారు.

గడువులోగా ప్రీమియం చెల్లించాలి

కోడుమూరు రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పీఎం ఫసల్ బీమా యోజన కింద రబీ పంటలకు గడువులోగా ప్రీమియం చెల్లించాలని వ్యవ సాయాధికారి రవిప్రకాష్ అన్నారు. బుధవారం ముడుమలగుర్తిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. డాట్ సెంటర్ సైంటిస్ట్ కిషోర్‌కుమార్, జిల్లా వనరుల కేంద్రం ఏవో నాగసరోజమ్మ పాల్గొని మాట్లాడారు. పప్పుశనగ పంటకు ఎకరానికి రూ. 420, జొన్న రూ. 297, వేరుశనగ రూ. 480లు ప్రీమియం కింద చెల్లించాలన్నారు.

'ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులు ఆపాలి'

గూడూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులు ఆపాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ మండల కార్యదర్శి జే.మోహన్ కోరారు. బుధవారం గూడూరులో ఏపీ గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో జే.మోహన్ ఎంపీడీవో శివనాగప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయరెడ్డిలకు వినతి పత్రాన్ని సమర్పించారు. సీఐటీయూ నాయకుడు గుంటప్ప, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బీఎల్‌వోలు అందుబాటులో ఉండాలి

సి.బెళగల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): బీఎల్‌వోలు ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో డిప్యూటీ తహసీల్దార్ పురుషోత్తం అధ్యక్షతన బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువత ఓటు నమోదు చేసుకోవాలన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు హాస్పిటల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్.భాస్కర్‌కు 104 ఉద్యోగుల సంఘం వినతి పత్రం సమర్పించింది. సంఘం జిల్లా అధ్యక్షుడు వై. వెంకటేశ్వర్లు మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి చంద్రహాస్, ఇలియాజ్, అజయ్, మంజుల, కళ్యాణి, అశోక్, మల్లికార్జున పాల్గొన్నారు.

రేపు కాల్వబుగ్గలో వేలం

ఓర్వకల్లు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్వబుగ్గ ఆలయంలో ఈనెల 8న వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఈవో మద్దిలేటి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ దేవస్థానం ప్రాంగణంలో టెంకాయలు అమ్ముకునేందుకు, పార్కింగ్ ఫీజు వసూళ్లకు, తాత్కాలిక కల్యాణ మండపం, టీటీడీ కల్యాణ మండపం, సుంకిరెడ్డి, సదానంద సత్రాలకు సప్లయ్ సామగ్రి పెట్టుకునే హక్కు, దేవస్థానం సత్రాలు, సప్లయ్ 1, 2, 3 దుకాణాలు దేవస్థానం మామిడి, హోటళ్లు, ఆలయ ప్రాంగణంలో ఐస్‌క్రీమ్ అమ్ముకునే హక్కు, టెంకాయలు, చెప్పుల స్టాండ్ పెట్టుకునే హక్కు వంటి వాటికి వేలం పాటలు నిర్వహిస్తునట్లు తెలి పారు. వేలంలో పాల్గొనే వారు టెంకాయలు అమ్ముకునే హక్కు రూ.50 వేలు, పార్కింగ్ ఫీజు, తాత్కాలిక కల్యాణ మండపం, అంగళ్లకు రూ.5 వేలు, టీటీడీ కల్యాణ మండపం, దేవస్థానం సత్రం సప్లయ్ సామగ్రి పెట్టుకునేందుకు రూ.50వేలు డిపాజిట్లు చెల్లించాలని ఆయన కోరారు.

శ్రీచైతన్య కళాశాలలో రక్తదాన శిబిరం

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక బాగ్యనగర్‌లోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఏజీఎం మురళీకృష్ణ, సురేష్ బాబులు ప్రారంభించారు. విద్యా సంస్థల చైర్‌పర్సన్ ఝాన్సీ లక్ష్మీబాయి జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. 92 మంది టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు రక్తదానం చేసినట్లు మురళీకృష్ణ తెలిపారు. డీన్స్ బాలాజీ, సరళ, కళ్యాణ్ బాబు, కృపారాజు, ఆర్ఐలు, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

శిక్షణను బహిష్కరించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాన్ని బహిష్కరించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వీజీ వెంకట్రాముడు, జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు రెసిడెన్షియల్ శిక్షణలో ఒత్తిడికి గురై రత్నకుమార్ మృతి చెందడంపై డీటీఎఫ్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. రత్నకుమార్ మరణానికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించి, వారి కుటుంబానికి రూ.కోటి నష్టం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యారంగానికి ఏమాత్రం ఉపయోగపడని ఇలాంటి శాస్త్రీయ శిక్షణలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

● ఉపాధ్యాయులకు నిర్బంధ వసతి శిక్షణ తరగతులు రద్దు చేయాలని ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. శిక్షణ ఒత్తిడికి గురై రత్నకుమార్ మృతి చెందడం బాధ కలిగిస్తుందన్నారు.

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా ఉండి జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోట రత్నకుమార్ గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమని, ఆయన కుటుంబ సభ్యులకు ఏపీ కర్నూలు జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం తరపున జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ప్రధానోపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో హెచ్ఎం మృతి చెందడం బాధాకరమన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

సి.బెళగల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సి.బెళగల్ మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాణెమ్మ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఈ సమావేశానికి కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు హాజరవుతారన్నారు. మండల స్థాయి అధికారులు మూడు నెలల నివేదికలను సూపరింటెండెంట్‌కు అందజేయాలన్నారు.

సదస్సును జయప్రదం చేయండి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఏపీ మున్సిపల్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 10న విజయవాడలో జరిగే మున్సిపల్ ఇంజనీర్ల సదస్సును జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సదస్సుకు రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ హాజరవుతున్నారన్నారు. సదస్సుకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

టీడీపీ సభ్యత్వం తీసుకోండి



రాంపురంలో టీడీపీ సభ్యత్వ నమోదు చేయిస్తున్న నాయకులు

తుగ్గలి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సిద్ధాంతాలు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలన నచ్చిన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా సభ్యత్వ నమోదు చేసుకోవాలని టీడీపీ మండల ఉపాధ్యక్షుడు తిరుపాల్ నాయుడు, వెంకట్రాముడు చౌదరి, మాజీ సర్పంచ్ చంద్రన్నలు అన్నారు. బుధవారం రాంపురంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు భీమలింగప్ప చౌదరి, మద్దిలేటి చౌదరి, మల్లయ్య, రఫీ, ఫక్కీరప్ప, శివ తదితరులు ఉన్నారు.

తుగ్గలి తహసీల్దార్‌గా రమాదేవి

తుగ్గలి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తుగ్గలి తహసీల్దార్‌గా రమాదేవి బాధ్యతలు స్వీకరించారు. బుధవారం తుగ్గలి తహసీల్దార్ కార్యాలయంలో బదిలీపై వచ్చిన తహసీల్దార్ రమాదేవిని డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు, వీఆర్వోలు అభినందనలు తెలిపి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో వీఆర్వోలు నాగేంద్ర, కాశీరంగస్వామి, వెంకట్రాముడు, స్వరూప్, రంగన్న, డీలర్ సుంకన్న తదితరులు ఉన్నారు.

నైపుణ్య గణన సర్వే

ఆదోని రూరల్ నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో నిరుద్యోగాన్ని నివారించడానికి ప్రభుత్వం నైపుణ్య గణన (స్కిల్ డెవలప్‌మెంట్) సర్వే నిర్వహిస్తోందని నియోజకవర్గ స్కిల్ సర్వే ఇంచార్జీ అల్తాఫ్ తెలిపారు. బుధవారం ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన ఎంపీపీ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులకు స్కిల్ సర్వేపై ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ, సచివాలయ ఉద్యోగులు ప్రతి ఇంటికెళ్ళి 15నుండి 59సంవత్సరాలు కలిగిన నిరుద్యోగులను గుర్తించి నైపుణ్య గణన చేపట్టాలన్నారు. నిరుద్యోగులు ఎంతవరకు చదువుకున్నారు. వారు ఏ పని చేయడానికి ఆసక్తిగా ఉన్నారు. వారి నైపుణ్యాల గురించి సమాచారాన్ని యాప్‌లో పొందపర్చాలని సచివాలయ ఉద్యోగులకు సూచించారు.

విధుల్లో అలసత్వం వద్దు : ఎమ్మెల్యే

పత్తికొండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యం వీడాలని ఎమ్మెల్యే శ్యాంబాబు అన్నారు. పట్టణంలోని సచివాలయం-3ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టార్‌లో ఆరుగురు సిబ్బంది సంతకాలు చేసి బయటకు వెళ్లడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీప్పవని హెచ్చరించారు. అనంతరం రైతుభరోసాకేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యాలయం హాలులో పాడైపోయిన యూరియా బస్తాలను చూసి ఇదేనా కార్యాలయం నిర్వహించే తీరని, అక్కడ విధుల్లో ఉన్న సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా బస్తాలు పంపిణీ చేయకుండా ఎందుకు ఉంచారని ప్రశ్నించారు. అలాగే ఆరోగ్యకేంద్రంలో పరిశీలనకు వెళ్లారు. చిన్నారులకు ఇంజక్షన్స్ కార్యక్రమం జరుగుతుండడంతో ఓచిన్నారికి ఇంజక్షన్ వేయడం దగ్గర ఉండి పరిశీలించారు. బైపాస్‌సమీపంలో పుచ్చకాయలమడ రహదారిలో ఉన్న మోడల్‌స్కూల్‌ను ఎమ్మెల్యే విజిట్ చేశారు. మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్న ప్రాంతం వద్దకు వెళ్లి విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఆర్వోప్లాంట్ పనిచేయకపోవడంపై హెచ్‌ఎంను ప్రశ్నించారు. వెంటనే మరమ్మతులు చేయించి విద్యార్థులకు స్వచ్ఛమైన నీటిని అందించాలని సూచించారు. 10వతరగతి క్లాస్‌లో విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. అధికారులు విధుల పట్ల అంకితభావంతో పని చేయాలని అన్నారు. లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనతోపాటు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు సాంబశివారెడ్డి, క్రిష్ణా, చౌదరి తదితరులు ఉన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్యాంబాబు

కార్మికులు బాగుంటేనే మనమందరం సురక్షితం

ఆదని టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య కార్మికులు బాగుంటే పట్టణంలోని రెండున్నర లక్షల మంది ప్రజలు కూడా బాగుంటారని, కార్మికులకు అన్ని సౌకార్యాలు అందేలా చూస్తానని ఎమ్మెల్యే డా పార్థసారథి అన్నారు. వరదలు ముంచేత్తిన విజయవాడ నాగరాన్ని పది రోజుల పాటు శుభ్రం చేయడానికి శ్రమించిన వంద మంది పారిశుధ్య కార్మికులకు బుధవారం మునిసిపల్ కౌన్సిల్ హాల్‌లో ఎమ్మెల్యే సన్మానించి, రెండున్నర వేల ఖరీదు చేసే జత బట్టలను పంపిణీ చేశారు.ఆయన మాట్లాడుతూ, కార్మికులందరికి ఈయస్ఐ సౌకర్యం ఉండాలన్నారు. పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేస్తానని, పట్టణంలోని ప్రజలందరికీ ఉచిత కార్పొరేట్ తరహా వైద్య సేవలు అందజేయడానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ కృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ డా అనుపమ, ఎంఈ ఇంటియాజ్, ఛైర్ పర్సన్ వాల్మీకి శాంత, వైస్ ఛైర్మన్ నరసింహులు, బీజేపీ కౌన్సిలర్లు వెల్లల లలితమ్మ, పద్మావతి, సురేష్, కిట్టు, వైసీపీ కౌన్సిలరులు పాల్గొన్నారు.

ఆదోని: భగవద్గీత ఉత్తమ జీవన విధానానికి ఒక మంచి మార్గమని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. బుధవారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మప్రచార కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పాల్గొని ఉచితంగా భగవద్గీత పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. భగవద్గీత పుస్తకాలను టీటీడీ ధర్మ ప్రచారం ద్వారా అన్ని పాఠశాలల్లో అందజేయాలని కోరారు.



విద్యార్థినులకు భగవద్గీత పుస్తకాలను అందజేస్తున్న ఎమ్మెల్యే

పల్లెల అభివృద్ధే చంద్రబాబు ధ్యేయం



సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న మాజీ జడ్పీటీసీ పురుషోత్తం చౌదరి

మద్దికెర, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పల్లెల అభివృద్ధే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధ్యేయంగా ముందుకు సాగుతున్నాడని మాజీ జడ్పీటీసీ సభ్యుడు పి.పురుషోత్తం చౌదరి అన్నారు. బుధవారం మండలంలోని పెరవలి గ్రామంలోని బీసీ కాలనీలో రూ.35 లక్షలతో వేసే సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటవర్మ, మాజీ దేవాలయ ఛైర్మన్ బారిక ఆంజనేయ, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి పెరవలి రామాంజులు, ఫీల్డ్ అసిస్టెంట్ మెడికల్ రాము, షేక్షావలి, రంగస్వామి, ఈశ్వరప్ప, రంగరావు, ఖలీల్‌బాషా ఉన్నారు.

లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి

● న్యాయాధికారి ఎంఎస్ భారతి

పత్తికొండ టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల డిసెంబరు 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని న్యాయాధికారి ఎంఎస్ భారతి కోరారు. బుధవారం స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు పత్తికొండ జూనియర్ సివిల్ కోర్టులో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందన్నారు. న్యాయవాదులు తమ పరిధిలో ఉన్న రాజీ అయ్యే అవకాశాలు ఉన్న కేసులను గుర్తించి కక్షిదారులతో మాట్లాడి వీలైనన్ని కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు రంగస్వామి, ప్రధాన కార్యదర్శి మహేష్, కోశాధికారి రాజశేఖర్, ఉపాధ్యక్షులు రవికుమార్, సహాయ కార్యదర్శి వాసు, న్యాయవాదులు ఎల్లారెడ్డి, సురేష్ కుమార్, గోపాల్ రెడ్డి, సురేంద్ర, నరసింహయ్య పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంచుకోండి

మద్దికెర, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయా శాఖ అధికారి ఉప్పర రవి అన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. సమాచార హక్కు చట్టం ఉద్దేశాలు, నియమ నిబంధనలను వివరించారు. ప్రజలు సమాచార హక్కు చట్టం ద్వారా ఏదైనా సమాచారం అడిగితే.. 30 రోజుల్లో సమాచారాన్ని అందించాలన్నారు.

రైల్వేలో ఉద్యోగాలను భర్తీ చేయాలి



రైల్వే స్టేషన్ మాస్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా రైల్వే శాఖలో ఖాళీగా ఉన్న 2.89లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్ డిమాండ్ చేశారు. బుధవారం కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఆదోని రైల్వే స్టేషన్ మాస్టర్ వెంకటేశ్వర్లను కలిసి డీవైఎఫ్ఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ రైల్వే శాఖలో రిటైర్డ్ అయిన ఉద్యోగులను మళ్లీ విధుల్లోకి తీసుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇప్పటికే నిరుద్యోగ యువతీ, యువకులు చదువుకొని ఉద్యోగాలు లేక కుటుంబాలు పోషించుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం యువతకు ఉపాధి కల్పనలో విఫలం చెందిందన్నారు. ఖాళీగా ఉన్న లక్షలాది ఉద్యోగాలను భర్తీ చేయకుండా ప్రభుత్వం రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేయడం, యువతకు ఉపాధి దూరం చేయడాన్ని ఆరోపించారు. లాభాల బాటలో నడుస్తున్న రైల్వే లైనులను స్టేషన్లను పార్సిల్ క్యాటరింగ్‌లను ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పి సామాన్య మధ్య తరగతి ప్రజానీకానికి సర్వీసు చాలా ఖరీదుగా మారిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన తీరును మార్చుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు వెంకీ, శ్రీనివాసులు, మోహన్, నవీన్, వీరేష్, నాగరాజు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ అమలు కోసం ప్రజాపోరు

ఆదోని రూరల్ నవంబరు 06 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు అమలు కోసం సీపీఎం ప్రజాపోరుబాట కార్యక్రమాన్ని చేపడుతున్నామని నాయకులు వెంకటేష్, లింగన్నలు పేర్కొన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ 8 నుంచి 14వ తేదీవరకు సీపీఎం ప్రజాపోరు కార్యక్రమం ఉంటుందని అన్నారు.

కాటికాపర్లను వృత్తిదారులుగా గుర్తించాలి

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : శ్మశానాలలో కాటికాపరుల గుంతలు తీసే బేదారులను ప్రభుత్వం వృత్తిదారులుగా గుర్తించాలని ఆసంఘం జిల్లా అధ్యక్షుడు తిక్కప్ప, పట్టణం కార్యదర్శి యువరాజు కోరారు. బుధవారం 18వార్డు సచివాలయ అధికారి లీలాను కలిసి వినతిపత్రం ఇందజేశారు. మాట్లాడుతూ శ్మశానాల్లో గుంతలు తీస్తూ కాటికాపరులుగా పని చేస్తున్నప్పటికీ తమ ప్రభుత్వం ప్రత్యేకమైన పథకాలు అందించడం లేదన్నారు. తమని నాలుగవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. జీవో నెంబర్ 1235 ప్రకారం ప్రతి దళిత పేటకు రెండు ఎకరాల స్థలం కేటాయించి వృత్తిదారులందరికీ ఉపయోగపడే పరికరాలు ఇవ్వాలని, ఉచిత ఆరోగ్య బీమా, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాటికాపరుల సంఘం నాయకులు వినోద్ కుమార్, చంద్రశేఖర్, హనుమంతు, ఉదయ్, నరేంద్ర, నేతాజీ పాల్గొన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ

ఆలూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆలూరు- బళ్ళారి ప్రధాన రహదారిలో పోలీసులు విస్తృతంగా వాహనాలు తనిఖీలు నిర్వహిస్తున్నారు. కార్లు మొత్తం సోదా చేశారు. అక్రమంగా నిషేధిత వస్తువులు తరలిస్తే వాహనాలు సీజ్ చేస్తామని ఆలూరు ఎస్సై వెంకట నరసింహులు బుధవారం తెలిపారు.

సమస్యలు పరిష్కరించడంలో ముందుండాలి



ఎమ్మెల్యే శ్యాంబాబును కలిసిన నాయకులు

తుగ్గలి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో పని చేస్తున్న అధికారులు ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ముందుండాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. బుధవారం తుగ్గలి మండల పంచాయతీ కార్యదర్శులు నారాయణస్వామి, కార్తీక్ నాయక్, రంగనాథ్, ఏపీవో హేమసుందర్‌తో పాటు తుగ్గలి మండల నాయకులు ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుకు శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం అధికారులతో ఎమ్మెల్యే కేఈ మాట్లాడుతూ మండలంలోని మండల స్థాయి, గ్రామస్థాయి అధికారులందరూ ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ముందుండాలని, నిర్లక్ష్యం వహిస్తే వారిపై చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, తిమ్మయ్య చౌదరి, ఈశ్వర్ రెడ్డి, వెంకటపతి, తిరుపాల్ నాయుడు, మాజీ ఎంపీపీ గురుస్వామి, వెంకటస్వామి, సర్పంచ్ ఓబులేసు, సత్యప్రకాష్, కోటేష్ ఉన్నారు.

సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం: బీవీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

నందవరం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ముగతి, పోణకలదిన్నె గ్రామాల్లో ఎమ్మెల్యే రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించేందుకు అన్ని ఏర్పా ట్లు చేస్తున్నట్లు తెలిపారు. రూ.262 కోట్లతో గోనెగండ్ల జీడీపీ ద్వారా ఇబ్రహింపురం, నదికైరవాడిలకు శుద్ధజలం అంది ంచేందుకు ప్రతిపాదనలు పంపామని, వాటిని త్వరలో మంజురు చేయించి వాటర్‌గ్రిడ్ ద్వారా ప్రతి గ్రామానికి నీరందిస్తానని అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఈరన్నగౌడు, నాయకులు భార్గవ్‌యాదవ్, తులసీరామ్ యాదవ్, తాయన్న, కొండయ్య, కాశీంవలీ, గోపాల్, శాంతమ్మ, వెంకట్రామిరెడ్డి, చాకలి చంద్ర, నరసప్ప, వీరేష్ , అదిశేషు, నందవరం తెలుగు ఈరన్న, చాకలి వెంకటే శ్వర్లు, జగన్నాథరెడ్డి, దావీదు, నాగరాజు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలి: ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే బీవీ జయనాగే శ్వరరెడ్డి ఆకాంక్షించారు. మండలంలోని పొణకలదిన్నె గ్రామంలో బుధవారం పెద్దరాజుల దర్గాలో ఎమ్మెల్యే ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో, కాశీంవలీ, ఈసు, శాంతమ్మ, వెంకటేశ్వర్లు, శ్రీరా ములు, మత పెద్దలు పాల్గొన్నారు.

అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులోకి తెస్తాం: ఎమ్మిగనూరు: వచ్చే ఏడాది నుంచి ప్రభుత్వ వైద్యశాలలో అన్నిరకాల వైద్యసేవలు అందిం చేందుకు చర్యలు తీసుకుం టామని ఎమ్మెల్యే బీవీ జయనా గేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న వంద పడ కల ఆసుపత్రి పనులు ఎక్కడి వరకు వచ్చాయి, ఆసుపత్రిలో ఏఏ పోస్టులు ఖాళీగా ఉన్నాయో అనే విషయాలను తెలుసుకు న్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఏమేరకు వైద్యం అందిస్తు న్నారో అనే విష యంపై ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రి డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులుగా బోడబండ సురేష్ చౌదరి, అంబేడ్కర్, వాల్మీకి రామకృష్ణా నాయుడు నియమిం చారు. సమావేశంలో ఆసుపత్రి సూపరిండెం టెంట్ డాక్టర్ సుధ, వైద్యులు మల్లికార్జున, చిరంజీవిలతో పాటు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని కలిసిన న్యాయవాదులు: ఎమ్మిగనూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురురాజు, రఘురాంల ఆధ్వర్యంలో న్యాయవాదులు సాల్మాన్, రఫీ దుల్లా, ఏసేపు, జగన్నాథరెడ్డి, సోమన్న, శ్రీనివాసులు, ప్రసాదు, నర్సిరెడ్డి, భాషా బుధవారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డిని కలిశారు. ఎమ్మిగనూరు కోర్టుకు అదనంగా రెండు అడిషనల్ కోర్టులు, ఒక సబ్ కోర్టు మంజూరు కావటంతో పాటు గోనేగండ్ల మండలాన్ని ఎమ్మిగనూరు కోర్టు పరిధిలోకి తీసుకురావటంతో న్యాయ వాదులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం న్యాయవాదులు ఎమ్మెల్యేను సన్మానించారు.

టీడీపీ సభ్యత్వం కార్యకర్తకు వజ్రం లాంటిది



టీడీపీ సభ్యత్వాన్ని నమోదు చేస్తున్న శ్రీనివాసరెడ్డి

కోసిగి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తకు పార్టీ సభ్యత్వం వజ్రం లాంటిదని, ఆపదలో అండగా ఉంటుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం కోసిగి మండల పరిధిలోని డి.బెళగల్ గ్రామంలో క్లస్టర్ ఇన్‌చార్జి జంపాపురం కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్ర మంలో టీడీపీ నాయకులు పెండ్యాల భరద్వాజశెట్టి, విజయరామిరెడ్డి, మాదేవ, రామయ్య, రాజశేఖర్ రెడ్డి, నరసింహులు, వీరారెడ్డి, నర్సారెడ్డి, ఎంపీటీసీ రాజు, సోల్మాన్‌రాజు, సిద్దప్పగౌడు, భీమయ్య, హనుమంతు, చంద్ర, శ్రీనివాసులు, నీలకంఠ, తిక్కయ్య, అంజిరెడ్డి, రామాంజనేయులు, హుశేనీ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ : కోసిగి మండల కేంద్రానికి చెందిన నాడిగేని రంగన్నను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి బుధ వారం పరామర్శించారు. అధైర్యపడవద్దని అండగా ఉంటామని ఆయన తెలిపారు. ఆయన వెంట కోసిగి పట్టణ నాయకులు భరద్వాజశెట్టి, నాడి గేని వీరారెడ్డి, ఎంపీటీసీ రాజు, ఉరుకుందు, విజయరామిరెడ్డి, నర్సారెడ్డి, నీలకంఠ, నరసింహులు, ఉలిగయ్య పాల్గొన్నారు.

'తప్పుడు ప్రచారాలపై చర్యలు తీసుకోండి'

మంత్రాలయం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని టీడీపీ తెలుగు యువత జిల్లా కోఆర్డినేటర్ విజయరామిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మంత్రాల యం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ పరమేష్ నాయక్‌ను కలిసి ఫిర్యాదు చే శారు. ఆయన మాట్లాడుతూ దేవనకొండ మండలం కప్పట్రాళ్ల గ్రామం లో యురేనియం తవ్వకాలపై సామాజిక మాధ్యమాల్లో ప్రజలను భయ భ్రాంతులకు గురి చేసే విధంగా ప్రజలపై అసత్య ఆరోపణలు చేస్తున్నా రని, అలాంటి వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని కోరారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

గోనెగండ్ల సీఐ గంగాధర్



గోనెగండ్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసు కుంటామని సీఐ గంగాధర్ అన్నారు. మండ లంలో ప్రస్తుతం శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని అన్నారు. బుధవారం సీఐ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లా డారు.

ప్రశ్న: గోనెగండ్ల మండలంలో ఫ్యాక్షన్ గ్రామాలు ఎలా ఉన్నాయి ?

జవాబు: మండలంలో గతంలో ఫ్యాక్షన్ గ్రామాలుగా కున్నూరు, అగ్రహారం, బైలుప్పల, గంజహళ్లి, హెచ్ కైర వాడి, లింగందిన్నె ఉన్నాయి. అయితే ప్రస్తుతం కున్నూరును మాత్రమే ఫ్యాక్షన్ గ్రామంగా పోలీసుశాఖ గురించింది. అందులో పోలీస్ పికెట్ కూడా ఏర్పాటు చేశారు.

ప్ర: మండలంలో మట్కా, పేకాట రాయుళ్లు ఉన్నారా ?

జ: మండలంలో మట్కా అయితే లేదు. కాని కొన్ని గ్రామాలలో పేకాట రాయుళ్లు ఉన్నారు. వారిపై గ్రామాలలో పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. దొరికినప్పుడు కేసులు నమోదు చేస్తున్నాం.

ప్ర: మండలంలో క్రైం రేట్ ఎలా ఉంది?

జ: మండలంలో ప్రస్తుతం క్రైం రేటు అదుపులో ఉంది. గ్రామాలలోని ప్రజలలో అక్షరజ్ఞానం పెరిగింది. తమ పిల్లలు ఉద్యోగులు కావాలనే అనేవిధంగా భావిస్తున్నారు. తల్లిదండ్రులు కూడా గొడవలకు, నేరాల దూరంగా ఉంటుండటంతో నేరాలు తగ్గిపోయాయి.

ప్ర: గ్రామాలలో నైట్ బీట్ ఏర్పాటు చేశారా ?

జ: మండల కేంద్రమైన గోనెగండ్లతో పాటు కొన్ని గ్రామాలలో నైట్ బీట్ ఏర్పాటు చేశాం. రాత్రి పూట వీధుల్లో పోలీసులు తిరుగుతున్నారు.

కాన్పులకు డబ్బులు వసూలు చేయడమేమిటి..?

● గర్భిణులను ప్రైవేటుకు తీసుకెళ్తున్నారని ఎంపీటీసీల ఆరోపణ
● కోసిగి సర్వసభ్య సమావేశంలో ప్రభుత్వ ఆసుపత్రిపై రగడ

కోసిగి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కోసిగిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులు కాన్పు కోసం వస్తే రూ.రెండువేల నుంచి రూ.మూడువేల వరకు వైద్యులు, స్టాఫ్ నర్సులు వసూలు చేస్తున్నారని అర్లబండ ఎంపీటీసీ గౌళ్ల తాయమ్మ, జంపాపురం సర్పంచ్ రానోజీ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కోసిగి మండల కేంద్రంలోని ఎంపీపీ ఈరన్న అధ్యక్షతన ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు హాజర య్యారు. ముఖ్యంగా పీహెచ్‌సీ వైద్యులు ఎవరూ హాజరు కాకపోవడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి లేటుగా వచ్చిన డాక్టర్ అభిరూప్‌పై ఎంపీపీ ఈరన్న, ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటేశ్వర్లు మండిపడ్డారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఆశావర్కర్లు ఆదోనిలో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లకుండా ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తూ రూ.5వేల నుంచి రూ.10వేల దాకా ఖర్చు చేయిస్తున్నారని, ఆశాలు కూడా గర్భిణుల నుంచి డబ్బులు వసూలు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని సభ దృష్టికి అర్లబండ ఎంపీటీసీ గౌళ్ల తాయమ్మ తీసుకవచ్చారు. కోసిగిలోని వైద్యులు సమయపాలన పాటించడం లేదని ఎంపీటీసీ రాజు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సిబ్బంది తీరును వైద్యాధికారులు పట్టించు కోవడం లేదని, ఇలాగైతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు తెలిపారు. సమావేశంలో అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



డాక్టరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సర్పంచులు, ఎంపీటీసీలు

రమణీయం.. ప్రహ్లాదరాయల రజిత రథోత్సవం



రజిత రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు రజిత రథంపై భక్తులకు దర్శ నం ఇచ్చారు. బుధవారం కార్తీక పంచమి శుభదినాన్ని పురస్కరించుకుని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులతో అర్చకులు బృం దావనానికి పూజలు నిర్వహించారు. అనంతరం ఊంజలసేవ నిర్వహిం చారు. వేలాదిమంది భక్తులు తరలివచ్చి గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రస్వామికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నా రు. మహిళలు పెద్ద ఎత్తున కార్తీక దీపాలను వెలిగించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో రాఘవేంద్ర స్వామి మఠం కిక్కిరిసింది.

పీఎం ఫసల్ బీమా యోజనను వినియోగించుకోండి

గోనెగండ్ల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రైతులు పీఎం ఫసల్ బీమా యోజన పథకాన్ని వినియోగించుకోవాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏవో హేమలత కోరారు. బుధవారం మండలంలోని పలు గ్రామాలలో వారు పర్యటించి పంటలను పరిశీలించారు. అనంతరం గోనెగండ్ల రైతు సేవా కేంద్రంలో మాట్లాడుతూ ఆసక్తి గల రైతులు రబీ సీజన్‌లో సాగే చేసుకున్న పంటలకు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించు కోవాలని కోరారు. ఇందులో పప్పుశనగ, పంటకు ఎకరంకు రూ. 420, వరిపంటకు రూ. 630, జొన్న పంటకు రూ. 297, వేరుశనగ పంటకురూ. 480, ఉల్లిపంటకు రూ. 1350, టమోటా పంటకు రూ. 1500, ప్రీమియం ను డిసెంబరు 15లోపు చెల్లించాలని తెలియజేశారు. పీఎం ఫసల్‌బీమా యోజన్ పథకంలో పప్పుశనగ, వరి, జొన్న, వేరుశనగ, ఉల్లి పంటలు వస్తాయని, వాతవరణ బీమా కింద టమోటా, పంటలు వస్తాయని తెలియజేశారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు.

సభలను జయప్రదం చేయండి

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అమరవీరుల సంస్మరణ సభలను జయప్రదం చేయాలని భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఏసేపు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి అనీఫ్ పిలుపునిచ్చారు. బుధవారం ఏనుగబాలలో కరపత్రాలు విడుదల చేశా రు. వారు మాట్లాడుతూ ఆదోనిలో ఈనెల 16న చంద్ర పుల్లారెడ్డి, నీలం రామచంద్రయ్య లాంటి అమరుల సభలను నిర్వహించనున్నట్లు తెలిపా రు. కార్యక్రమంలో శాంసంగ్, దావీదు, ప్రభుదాస్, రామన్న పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు విద్యార్థి ఎంపిక

కోసిగి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కందుకూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి చిన్న అండర్-14 జిల్లా స్థాయి క్రికెట్‌లో రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి హెచ్‌ఎం వెంగమ్మ తెలిపారు. బుధవారం రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన విద్యార్థి చిన్నను ఉపాధ్యాయులు అభినందించారు. కోసిగి మండలం నుంచి మొదటి సారిగా క్రికెట్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ నెల 25 నుంచి 29 వరకు కోనసీమ జిల్లాలోని అమలాపురంలో జరుగు రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో చిన్న పాల్గొంటున్నట్లు పీడీ వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్ర మంలో ఉపాధ్యాయులు ప్రభాకర్, నూర్జహాన్, పద్మావతి, శ్రావణి, ఆశా, పర్వీన్, వెంకటసుబ్బమ్మ, తిక్కయ్య, సంజీవరెడ్డి, లక్ష్మన్న ఉన్నారు.

ధార్మిక పర్యటనకు వెళ్లిన పీఠాధిపతి

మంత్రాలయం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ధార్మిక పర్యటనకు బయలు దేరి వెళ్లారు. బుధవారం మంత్రాలయంలో పూజలు ముగించుకుని తిరుపతికి వెళ్లారు. గురువారం తిరుపతి తిరుమల దేవస్థానంలో వివిధ పూజా కార్యక్రమాల్లో పాల్గొని సంస్థాన పూజలు చేసి అక్కడి భక్తులను ఆశీర్వదించనున్నారు. అక్కడ పూజలు ముగించుకుని శనివారం ఉద యం మంత్రాలయంలో భక్తులకు పీఠాధిపతి అందుబాటులో ఉంటారని మఠం ఏఏవో మాధవ శెట్టి, మఠం మేనేజర్ వెంకటేష్ జోషి తెలిపారు.

విరాళంగా రెండు వెండి దీపాలు

మంత్రాలయం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠానికి కర్ణాటకలోని దావణగేరికి చెందిన సుస్మిత కుటుంబ సభ్యులు 1.80 కేజీల వెండి దీపాలను విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజరు వెంకటేష్ జోషి తెలిపారు. బుధవారం ఆమె కు టుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. విరాళం ఇ చ్చిన దాత కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల,పుష్ప, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీ ర్వదించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ అనంతపురాణిక్, దత్తు స్వామి, నరసింహ దేశాయ్, శ్రీపాదఆచారి పాల్గొన్నారు.